Follow: @ANNTELUGU

ANN తెలుగు

27-11-2024

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 313 పేజీలు-09 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మహిళా రిజర్వేషన్లతో కొత్త శకం ఆరంభం

రాజ్యాంగం వల్లే సామాజిక న్యాయం, అభివృద్ధి

ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల


వివరాలు 2లో

డిమాండ్

### ఈవీఎంలు మాకొద్దు

- బ్యాలెట్ పేపర్లే కావాలి
- సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే

02



వార్నింగ్

### అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం

- అధికారులకు కేటీఆర్ హెచ్చరిక
- సిరిసిల్లలో కార్యకర్తలతో సమావేశం

02




గుడ్ టైం

### రాజ్యసభకు నాగబాబు?

- ఆంధ్రప్రదేశ్‌లో మరో ఎన్నికల సమరం
- ఈసీ షెడ్యూల్ విడుదల

02






### ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌కు లైన్ క్లియర్

# తెలంగాణకు నాలుగు ఎయిర్‌పోర్టులు


## వరంగల్ విమానాశ్రయం గ్యారంటీ.. ఖచ్చితంగా ఏర్పాటు చేస్తాం

- ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌పై సానుకూలం.. రక్షణ శాఖ అనుమతిస్తే.. ఏర్పాటుకు రెడీ..
- సీఎం రేవంత్ రెడ్డి వినతికి కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూల స్పందన
- రామగుండం, కొత్తగూడెంకు టెక్నికల్ టీమ్స్
- డిప్యూటీ సీఎం భట్టి, కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కేంద్రమంత్రితో చర్చించిన సీఎం

**ఢిల్లీ, మహా:** తెలంగాణలో రెండో రాజధాని నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను మంజూరు చేయడంతో పాటు తక్షణం పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకువిజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 253 ఎకరాల భూ సేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థ కి అందజేసినట్టు తెలిపారు.

మిగతా 2లో





## టార్గెట్ తెలంగాణ

### నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలతో ప్రధాని మోడీ కీలక భేటీ

హైదరాబాద్, మహా: మహారాష్ట్రలో బీజేపీ భారీ విజయంతో ఆ పార్టీ హైకమాండ్ తెలంగాణపై ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పీఎం మోడీ నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశం కానున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ రూమ్ నంబర్ 54లో వీరి భేటీ జరగనుంది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఎంపీలు ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. దీంతో మోడీ పిలుపుతో ఎమ్మెల్యేలు ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. స్టేట్ చీఫ్ తో పాటు తెలంగాణ లో కార్యాచరణపై మోడీ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.



తెలంగాణ మోడల్

## కులగణన చారిత్రాత్మకం

### మేం ఎక్కడ అధికారంలోకి వచ్చినా చేస్తం..

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇస్తం.. ప్రధాని మోడీ రాజ్యాంగం చదవలేదు

రాజ్యాంగ విరుద్ధంగా పాలన.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**ఢిల్లీ, మహా:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన చారిత్రాత్మకమని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎఐసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ రక్షణ్ అభియాన్ లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కులగణన చేపట్టామని, ఇది జనగణనలా అందరి భాగస్వామ్యంతో జరుగుతున్నదన్నారు.

మిగతా 2లో



### పాతబస్తీ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు

పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్ వరకు ఒక పూర్తి కారిడార్ ఉంటుందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. తొలి దశలో రోజుకు 5 నుంచి 7 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేశారు. రెండో దశలో రోజుకు 10 లక్షల మంది ప్రయాణిస్తారని అభిప్రాయపడ్డారు. పాతబస్తీ మెట్రోకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. పాతబస్తీలో 1100 ఆస్తులు సేకరించాలని, భూసేకరణకే పెద్ద ఎత్తున నిధులు ఖర్చవుతుందని అన్నారు.

చకచకా మెట్రో

# సెకండ్ ఫేజ్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల.. జనవరి నుండి పనులకు శ్రీకారం

- మూడు కారిడార్లు కలిపేలా రెండోదశ.. పాతబస్తీ మెట్రోకు ఇప్పటికే నిధులు
- సీఎం భరోసా వల్లే ముందడుగు- మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** మెట్రో రెండోదశ విస్తరణ పనులు చకచకా సాగేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల, భరోసా వల్లే హైదరాబాద్ మెట్రో రెండో దశ కు శ్రీకారం చుడుతున్నట్లు మెట్రో రైలు ఎండి వెల్లడించారు జనవరి నుండి మెట్రో సెకండ్ ఫేజ్ ప్రారంభించే యోచనలో ఉన్న అధికారులు కేంద్రం అనుమతిస్తే చాలు.. రంగంలోకి దిగేందుకు సర్వం సిద్ధంచేసుకున్నారు. మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డితో సుదీర్ఘంగా చర్చించామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. రెండో దశలో ఆరు కారిడార్లతో 116.4 కి.మీ మెట్రోకు ప్రణాళిక రచించామని తెలిపారు. ప్రస్తుతం ఐదు కారిడార్లకు డీపీఆర్ సిద్ధం చేసి పంపించామని పేర్కొన్నారు.

మిగతా 2లో



ప్రియాంక మేడమ్..

## కంగ్రాట్స్

ఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - ఢిల్లీ, మహా

### రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు..

## ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు పని చేయాలి

### దేశంలోనే తొలిసారి కులగణన

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా:** రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు ఎన్ ఎస్ యుఐ కార్యకర్తలు పని చేయాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. పాఠ్య పుస్తకాలలో ప్రియంబుల్ ఉండే విధంగా చూడాలని సీఎంని కోరుతున్నట్లు తెలిపారు.

మిగతా 2లో



హైదరాబాద్‌లో అంబర్‌రెసోజెట్ సంస్థ

## భారీ పెట్టుబడి

- రూ. 250 కోట్లతో రాష్ట్రంలో కొత్త తయారీ ప్లాంట్
- నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. వేలాది ఉద్యోగాలు
- అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం నుంచి అందిస్తాం: పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్

వివరాలు 3లో



### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.85 | 175.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.85 | 175.5 |
| రిటైల్ గుడ్డు ధర | 6.32 | 189.54 |

డిజైన్ లేకుండానే.. సుందిళ్ళ బ్యారేజీ

## నిర్మాణం ప్రారంభం

### కాళేశ్వరం కమిషన్ ముందు ఇంజనీర్ల వెల్లడి

- కమిషన్‌ను తప్పుదోవ పట్టించవద్దని జస్టిస్ ఘోష్ ఆగ్రహం
- మేడిగడ్డ పునాదిరాయి కింద ఇసుక కదలడం వల్లే నష్టం
- సిఈ, ఇంజనీర్ల వెల్లడి

**హైదరాబాద్, మహా:** సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజనీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజినీర్లు విచారణకు

మిగతా 2లో



## రాష్ట్రంలో 16 కొత్త మండలాలు

### ఆదిలాబాద్‌లో సాత్నాల, భోరజ్, నూతన మండలాలుగా ఉత్తర్వులు

ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ధన్యవాదాలు తెలిపిన కంది శ్రీనివాసరెడ్డి

**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో కొత్త మండలాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా లోని జైనథ్ మండలం పరిధిలో గల సాత్నాల, భోరజ్‌లను కొత్తగా మండలాలుగా ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. పరిపాలన సౌలభ్యంతోపాటు మండలాల ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ప్రభుత్వానికి అనేకమార్లు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి విన్నవించారు. ఈ నేపథ్యంలో కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ కంది శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు ధనసరి సీతక్క, రెవెన్యూ మంత్రి పొంగులేటికి జిల్లావాసుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# తెలంగాణకు నాలుగు ఎయిర్‌పోర్టులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి కట్టబడి ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వరంగల్ మామునూరు విమానాశ్రయాన్ని ఖచ్చితంగా ఏర్పాటుచేస్తామని, వరంగల్‌తో పాటు మరో మూడు రామగుండం, కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారని తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయం రక్షణ శాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ నుంచి అనుమతి ఉంటే అక్కడ కూడా విమానాశ్రయాన్ని చేస్తామన్నారు. "ఆదిలాబాద్‌కు ఓవైపు చత్తీస్‌గఢ్, మరోవైపు మహారాష్ట్ర సరిహద్దులు ఉన్నాయి. దరిదాపుల్లో విమానాశ్రయం లేదు. అక్కడ ఏర్పాటు చేస్తే చాలామందికి ఉపయోగకరంగా ఉంటుంది. విమానయాన శాఖ వల్ల కేవలం విమాన ప్రయాణాలే కాదు.. టూరిజం ఉద్యోగ కల్పన మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి పెరుగుతుంది" అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆత్మీయంగా హత్తుకున్న రామ్మోహన్ నాయుడు తెలుగు రాష్ట్రాల ప్రగతికి కట్టుబడి ఉన్నామన్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, రామసహాయం రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, కుందూరు రఘువీర్ రెడ్డి ఉన్నారు.

**కేంద్రమంత్రితో చర్చలు**

- తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రానికి చెందిన అందుబాటులో ఉన్న ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గారిని కలిసి చర్చించారు.
- తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని ముఖ్యమంత్రి వివరిస్తూ, వరంగల్‌తో పాటు పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్‌లలో ప్రతిపాదిత విమానాశ్రయాల గురించి కేంద్ర మంత్రికి నివేదించారు.
- వరంగల్ తో పాటు మిగతా ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై వారితో చర్చించారు. ఒక విమానాశ్రయం నుంచి మరో విమానాశ్రయానికి 150 కి.మీ దూరం ఉండాలన్న నిబంధన అడ్డురాదని, ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ సంస్థ నుంచి నిరభ్యంతర పత్రం పొందిన అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించినట్టు సీఎం వివరించారు. ఆ భూమి వివరాలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు తదుపరి చర్యలు తీసుకోవాలని కోరారు.
- జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీఫీజిబిలిటీ సర్వేలో తేలిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావిస్తూ, అందుకు ప్రత్యామ్నాయంగా అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించామని, దానిపై తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు.
- ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాల విస్తరణకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని, అదనంగా అవసరమైన భూమిని సేకరించి అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

# చకచకా మెట్రో సెకండ్ ఫేజ్



**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం మీడియా సమావేశంలో పాల్గొన్న ఎన్వీఎస్‌రెడ్డి, మెట్రో విస్తరణపై మాట్లాడారు. 4 శాతం నిధులు పీపీపీ నుంచి సేకరించాలని కేంద్రం షరతు పెట్టిందని వివరించారు. కానీ నిధుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి స్పష్టమైన హామీ ఉందని తెలిపారు. మెట్రోరైలు ఏడేళ్లు పూర్తి చేసుకుందని, ఇది నగర వాసులకే కాకుండా రాష్ట్ర ప్రజలకు గర్వకారణమని అన్నారు. ముంబయి, చెన్నైలో రూ. లక్షల కోట్లతో మెట్రో విస్తరిస్తున్నారన్న ఎన్వీఎస్‌రెడ్డి, విస్తరణ లేకపోవడంతో హైదరాబాద్ మూడో స్థానంలో ఉందన్నారు. ఇంకా నిర్లక్ష్యం చేస్తే తొమ్మిదో స్థానానికి పడిపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ విధానంలో మెట్రో విజయవంతంగా నడుస్తోందని, మూడు కారిడార్లు విమానాశ్రయానికి కలిపేలా రెండో దశ ప్రతిపాదన రూపొందించినట్లు ఆయన చెప్పారు. విమానాశ్రయానికి ముందు 1.6 కి.మీ మేర భూగర్భంలో మెట్రో ఉంటుందని పేర్కొన్నారు.

### మెట్రో రెండోదశ రూట్లు ఇలా

**పార్ట్ ఏ కింద**

**కారిడార్ 4 - నాగోల్ - శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కారిడార్ - 36.8 కిమీ.**
**కారిడార్ 5 - రాయదుర్గం - కోకాపేట నియోపొలిస్ - 11.6 కిమీ.**
**కారిడార్ 6 - ఎంజిబిఎస్ చాంద్రాయణగుట్ట (ఓల్డ్ సిటీ కారిడార్) - 7.5 కిమీ.**
**కారిడార్ 7 - మియాపూర్ - పటాన్‌చెరు - 13.4 కిమీ.**
**కారిడార్ 8 - ఎల్బీ నగర్ - హయత్ నగర్ - 7.1 కిమీ.**
**ఇలా మొత్తం 76.4 కిలోమీటర్లు ఉంది.**

**పార్ట్ బి కింద:**

**కారిడార్ 9 - శంషాబాద్ - ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్శిటీ) - 40.0 కిమీ**
**మొత్తం 116.4 కిలోమీటర్లు ఉంటుంది.**

# ఈవిఎంలు మాకొద్దు.. బ్యాలెట్ పేపర్లే కావాలి

## మల్లికార్జున ఖర్గే



**ఢిల్లీ, మహా:** ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు వద్దని, బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశంలో ఐక్యత కావాలంటే విద్వేషాలను విస్తరించడం మానుకోవాలని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. బ్యాలెట్ పేపర్‌కు తిరిగి వచ్చేందుకు భారత్ జోడో యాత్ర తరహాలో ప్రచారం చేయాలని ఖర్గే ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కొందరు రాజ్యాంగాన్ని పొగిడి, దానికి నమస్కరించి భక్తిని ప్రదర్శిస్తుంటారని ఖర్గే అన్నారు. లోపల మాత్రం రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. ఈ యాత్రలో ఆయనతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కదిలివచ్చారని తెలిపారు.

**ఎస్సీ, ఎస్టీల బాటలో అడ్డుగోడ**

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల బాటలో అడ్డుగా ఉన్న గోడను ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ మరింత బలోపేతం చేస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ గోడను బలహీనం చేసేందుకు యూపీఏ ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో చేయలేకపోయిందని అంగీకరించారు. సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ పార్లమెంటులో జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

# రాజ్యసభకు నాగబాబు?

## ఆంధ్రప్రదేశ్‌లో మరో ఎన్నికల సమరం

### .. ఈసీ షెడ్యూల్ విడుదల


**మహా:** శాసనసభ, సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మరో ఎన్నికల సమరం దూసుకొచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు తమ సభ్యత్వాలకు రాజీనామా చేసిన నేపథ్యంలో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీలో ఖాళీ అయిన మూడు స్థానాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, హర్యానాలోని ఒక్కోస్థానానికి ఎన్నికల సంఘం ఎన్నిక చేపట్టనుంది. దేశంలోని మొత్తం ఆరు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తూ మంగళవారం ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో మూడు రాజ్యసభ సీట్లతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, హర్యానాలో ఒక్కొక్క స్థానానికి ఎన్నికలు జరపాలని ఈసీ నిర్ణయించింది. వైఎస్సార్‌సీపీ నుంచి రాజ్యసభ స్థానం పొందిన మోపిదేవి వెంకట రమణారావు, బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్య కొన్ని నెలల కిందట రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

**షెడ్యూల్ ఇలా..**

మొత్తం ఆరు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ డిసెంబర్ 3వ తేదీన విడుదల కానుంది. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపట్టి 13వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ప్రకటించింది. డిసెంబర్ 20వ తేదీన పోలింగ్ చేపట్టనుండగా.. అదే రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి కౌంటింగ్ చేపడతారు.

**ఎన్డీయే ఖాతాలోకే**

మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆరు స్థానాలు కూడా ఎన్డీయే ఖాతాలోకి వెళ్లే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు హర్యానా, ఒడిశాలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్న విషయం తెలిసిందే. సంఖ్యాబలంగా బీజేపీతోపాటు తన మిత్రపక్షాలు బలంగా ఉండడంతో ఆయా స్థానాలన్నీ ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. బీజేపీ ఒత్తిడితో ఏపీకి చెందిన రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన స్థానాలన్నీ టీడీపీ లేదా బీజేపీ పంచుకునే అవకాశం ఉంది. జనసేన నేత నాగబాబుకు ఈ దఫా బెర్త్ ఖాయమన్న ప్రచారం ఉంది.



**తెలంగాణ మోడల్**

# కులగణన చారిత్రాత్మకం

**మొదటిపేజీ తరువాయి**

భవిష్యత్తులో కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా కులగణన చేసి తీరుతామన్నారు. తెలంగాణలో రిజల్ట్ వస్తుందని, ఇది దేశవ్యాప్త సర్వేకు దోహదపడుతుందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఫలాలు బడుగు బలహీనవర్గాలకు దక్కడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తీసుకువస్తుందన్నారు. బిజెపి, ఆర్ ఎస్ ఎస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ప్రమాదంలో పడతాయన్నారు. ప్రదాని మోడీ రాజ్యాంగం చదవలేదని, అందుకే దేశంలో రాజ్యాంగ విరుద్ధపాలన సాగుతోందన్నారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జాతీయ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# రూ. 24 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

## మూసి వేసిన కెమికల్ పరిశ్రమలో తయారీ

**యాదాద్రి, మహా :** తెలంగాణలో భారీ ఎత్తున డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ నార్కోటిక్ బ్యూరో, రాచకొండ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌తో 120 కిలోల నిషేధిత ఎఫెడ్రిన్ మెఫెడ్రోన్ సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ. 24 కోట్లు ఉంటుందన్నారు. ఈ కేసును సంబంధించి నేతి కృష్ణారెడ్డి, ఫైజాన్ అహ్మద్ (ముంబై)తోపాటు డ్రైవర్ చెపురి సునీల్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే రెండు హ్యుందాయ్, వర్ణ కార్లతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అయితే వాసుదేవచారి, భాను ప్రసాద్, సల్మాన్ షేక్ డోల (ముంబై), సత్యనారాయణ (కెమిస్ట్) తదితరులు పరారీలో ఉన్నారన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన గాలింపు చేపట్టినట్లు చెప్పారు. సోమవారం గూడూరు టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీల్లో నిషేధిత ఎఫిడ్రిన్ మత్తు పదార్థాలు భయటపడ్డాయని, వీటిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే శ్రీయాదాద్రి ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఈ డ్రగ్స్ తయారు చేసినట్లు వెల్లడైందన్నారు. దీంతో సోమవారం రాత్రి శ్రీయాదాద్రి ఫార్మాస్యూటికల్ కంపెనీలో భారీ పోలీసు బలగాల మధ్య సోదాలు నిర్వహించగా, 120 కేజీల మత్తు పదార్థాలు పట్టుబడ్డాయని డీసీపీ పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం రామోజీ పేట్ శివారులో యాదాద్రి లైఫ్ సైన్స్ కెమికల్ పరిశ్రమను మూసి వేశారు. మూసి వేసిన కెమికల్ పరిశ్రమను అడ్డాగా చేసుకుని పెద్ద ఎత్తున డ్రగ్స్ ను తయారు చేస్తున్నట్లు తేలిందని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులనునమోదు చేశామని, పరారీలోఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

**రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు**

# ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు పని చేయాలి



**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా కాలరాసిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్ సంవిధాన్ దివాస్ సభలో ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బీజేపీ మార్చాలని ప్రయత్నాలు చేసిందన్నారు. బీజేపీ,ఆర్ఎస్ ఎస్ వాళ్లు వాళ్ళకి అనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అదరకుండా బేధరకుండా...రాజ్యాంగాన్ని కాపాడానికి ముందుకొచ్చాడని వ్యాఖ్యానించారు. దేశంలోనే మొదటి సారిగా తెలంగాణలోనే కులగణన చేస్తున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో మేధావుల సూచనలు, సలహాల ద్వారా కులగణన చేస్తున్నామని..బీజేపీ తిరోగమనం చేపట్టక తప్పదని కామెంట్స్ చేశారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు ఎన్ ఎస్ యుఐ కార్యకర్తలు పని చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. పాఠ్య పుస్తకాలలో ప్రియంబుల్ ఉండే విదంగా చూడాలని సీఎంని కోరుతున్నట్లు తెలిపారు. 8వ తరగతి నుండి విద్యార్థులకు రాజ్యాంగం తెలిసే విదంగా పుస్తకాలలో ప్రియంబుల్‌ను పొందుపర్చాలన్నారు. సమావేశంలో ఎన్ ఎస్ యుఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

## కలెక్టర్లు, అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

### పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ళు త్వరగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ తో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. సన్న, దొడ్డు రకాలను వేర్వేరుగా సేకరించాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే చెల్లింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సన్న రకాలపై ప్రభుత్వం అందిస్తున్న రూ. 500 విషయంలో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. గిట్టుబాటు ధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రతి సందర్భంలో పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా రైతుల్లో భరోసా కల్పించాలని చెప్పారు. రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో ధాన్యం పండించగా, ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉందన్నారు. సన్నరకాలకు తెలంగాణలో బోనస్ అందిస్తుండటంతో సరిహద్దు రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా ధాన్యం తరలిస్తున్నారని, అలాంటి వాటి పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ఇన్‌చార్జి మంత్రులు, ఇన్‌చార్జి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ధాన్యం కొనుగోళ్ల తీరును పర్యవేక్షిస్తూ రోజూవారి నివేదికలను సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈనెల 30వ తేదీన మహబూబ్ నగర్ లో రైతు పండగను జరుపబోతున్న సందర్భంగా 28, 29, 30 తేదీల్లో పట్టణంలో వ్యవసాయ అనుబంధ రంగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, ఆదర్శ రైతులతో రైతు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నందున ఆ సదస్సును విజయవంతం చేయాలని చెప్పారు. మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లాల కలెక్టర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో హైటెన్షన్

## ఆర్డీవోను 5 గంటలు నిర్భంధించిన గ్రామస్థులు

**నిర్మల్ , మహా:** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో మంగళవారం హైటెన్షన్ వాతావరణం చేటుచేసుకుంది. ఆర్డీవో రత్నకల్యాణిని దిలావర్‌పూర్ గ్రామస్తులు కారులోనే దాదాపు 5 గంటలుగా నిర్బంధించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని దిలావర్పూర్ గ్రామస్థులు తమ పోరాటం ఉధృతం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు హైవేపై మెరుపు దర్నాకు దిగారు. సుమారు 11 గంటలుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఇళ్లకి, స్కూళ్లకు తాళాలు వేసి మరీ రాస్తారోకో చేపట్టారు. చిన్నా, పెద్దా అంతా కలిసి ర్యాలీగా రోడ్డెక్కారు. గ్రామస్తుల మెరుపు ధర్నాతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో దిలావర్పూర్‌లో 500 మంది పోలీసులు భారీగా మోహరించారు.

# డిజైన్ లేకుండానే.. సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన డీఈ, ఏఈఈలను జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. పనులు, డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించారు. రెండో బ్లాక్‌ను పరిగణలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీని 2ఏ బ్లాకు నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్లు ఇంజనీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని జస్టిస్ పీసీ ఘోష్ అడగ్గా కొందరు ఇంజనీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసి కమిషన్ తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేసింది.

**ప్రమాణం చేసి అబద్ధాలు చెప్తే చర్యలు ఎదుర్కొవాలి**

అఫిడవిట్‌లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సిన వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్మెంట్ రిజిస్టర్లు, మెజర్మెంట్ బుక్స్‌పై ఇంజనీర్ల సంతకాలు తీసుకొన్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకుంది. బుధవారం మరో 18మంది ఇంజనీర్లను కమిషన్ విచారణ చేయనుంది.

**అందుకే నష్టం జరిగింది**

గత నెల జరిగిన విచారణలో కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీ పునాది ర్యాఫ్ట్ కింద ఇసుక కదలడంతోనే నష్టం జరిగి ఉంటుందని నీటిపారుదలశాఖ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఓ అండ్ ఎమ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. నాగేంద్రరావు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఈఎన్సీ నాగేందర్‌రావు, సీఈ అజయ్ కుమార్, ఇంజనీర్ ఓంకార్ సింగ్ హాజరయ్యారు. ఆనకట్టల నాణ్యత, నిర్వహణ, డ్యాం సేఫ్టీ నిబంధనల అమలు గురించి జస్టిస్ పీసీ ఘోష్ వారిని విచారించారు.

# అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం

## అధికారులకు కేటీఆర్ హెచ్చరిక



**సిరిసిల్ల, మహా:** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమాలు, అవినీతిని బయటపెడతామని, బీఆర్ఎస్ పార్టీని ఎవరూ ఏమీ చేయలేరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎవరెవరు ఏం చేస్తున్నారో అన్నీ రాసుకుంటున్నామని... అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామని అధికారులను హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 29న నిర్వహించ తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమంపై జిల్లాస్థాయి సన్నాహక కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. చీకటిని చూస్తేనే ప్రజలకు వెలుగు విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలన చూశారు... ఇప్పుడు రేవంత్ రెడ్డి చీకటి పాలన చూస్తున్నారన్నారు. 14 ఏళ్ల పాటు కొట్లాడి... పదవులు త్యాగం చేసి, ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించుకున్నామన్నారు. రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజమే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుకోకుండా అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణలో ఇప్పుడు ఎవరిని అడిగినా కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని చెబుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అవుతున్నా ఆరు గ్యారెంటీల లో ఒక్కదానినీ అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదన్నారు. తెలంగాణలో 'ఆర్ఎస్' బ్రదర్స్ పాలన సాగుతోందని రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌ని ఉద్దేశించి విమర్శించారు.

# మహిళా రిజర్వేషన్లతో కొత్తశకం ఆరంభం



**ఢిల్లీ, మహా:** భారత రాజ్యాంగం సజీవ, ప్రగతిశీల గ్రంథమని దాని ద్వారా సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. దేశానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిదని రాష్ట్రపతి అన్నారు. రాజ్యాంగ రచనలో 15 మంది మహిళలు భాగస్వాములైనట్లు రాష్ట్రపతి గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టంతో మహిళా సాధికారత దిశగా కొత్తశకం మొదలైనట్లు చెప్పారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు.

'రాజ్యాంగం మన పవిత్ర గ్రంథం. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రాజ్యాంగానికి రాజేంద్రప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గనిర్దేశం చేశారు. ప్రగతిశీల సూత్రాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములను స్మరించుకోవాలి. గత కొన్నేళ్లలో ప్రభుత్వం దేశంలోని అన్నివర్గాలు ముఖ్యంగా బలహీనవర్గాల అభివృద్ధి కోసం అనేకచర్యలు తీసుకుంది. అలాంటి నిర్ణయాలతో ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయి. వారికి అభివృద్ధికి సంబంధించి కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. పేదప్రజల సొంతింటి కల నిజమవుతోంది. విద్యుత్తు, తాగునీరు, రోడ్డు సదుపాయాలు లభిస్తున్నాయి. వైద్యసేవలు కూడా లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సమగ్ర అభివృద్ధి దిశగా చేపడుతున్న చర్యలు రాజ్యాంగ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నాయి' అని ముర్ము ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన రెండు పుస్తకాలు, 75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. మైథిలీ, సంస్కృత భాషల్లో రాజ్యాంగాన్ని విడుదల చేశారు. రాష్ట్రపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్యానికి ముప్ప**

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని అన్నారు. గందరగోళం సృష్టించడాన్ని ఒక వ్యూహంగా అమలు చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్ప వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిర్మాణాత్మక చర్చలు ప్రజాస్వామ్య దేవాలయాల పవిత్రతను పెంపొందిస్తాయని తెలిపారు. అంతకంటే ముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభోపన్యాసం చేశారు. 75 ఏళ్ల క్రితం ఆమోదించిన రాజ్యాంగంపై చర్చించేటప్పుడు రాజ్యాంగ సభ నిర్దేశించిన నిర్మాణాత్మక, గౌరవప్రదమైన చర్చల సంప్రదాయాన్ని అనుసరించాలని సూచించారు.

# ప్రమాణం చేసి మరీ అబద్ధాలు చెబుతారా?

## ఇంజినీర్లపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఫైర్

### కాళేశ్వరంపై డీఈ, ఈఈలను విచారించిన కమిషన్



**హైదరాబాద్, మహా :** సుందిళ్ల బ్యారేజీలోని 2 ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజనీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజనీర్లు విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన డీఈ, ఏఈఈలను జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. పనులు, డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించారు. రెండో బ్లాక్‌ను పరిగణలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీని 2ఏ బ్లాకు నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్లు ఇంజనీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని జస్టిస్ పీసీ ఘోష్ అడగ్గా కొందరు ఇంజినీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసి కమిషన్ తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేసింది. అఫిడవిట్‌లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సిన వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్ మెంట్ రిజిస్టర్లు, మెజర్ మెంట్ బుక్స్‌పై ఇంజినీర్ల సంతకాలు తీసుకున్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకుంది. బుధవారం మరో 18మంది ఇంజినీర్లను కమిషన్ విచారణ చేయనుంది. గత నెల జరిగిన విచారణలో కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీ పునాది ర్యాఫ్ట్ కింద ఇసుక కదలడంతోనే నష్టం జరిగి ఉంటుందని నీటి పారుదల శాఖ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఓ అండ్ ఎమ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. నాగేంద్రరావు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు జస్టిస్ పీసీ ఘెష్ కమిషన్ ముందు ఈఎన్సీ నాగేందర్‌రావు, సీఈ అజయ్ కుమార్, ఇంజనీర్ ఓంకార్ సింగ్ హాజరయ్యారు. ఆనకట్టల నాణ్యత, నిర్వహణ, డ్యాం సేఫ్టీ నిబంధనల అమలు గురించి జస్టిస్ పీసీ ఘోష్ వారిని విచారించారు.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్..?



**మహా:** మహారాష్ట్రలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజ్ భవన్ లో గవర్నర్ సీపీ రాధాకృష్ణనను కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. తదుపరి సీఎం పదవీ బాధ్యతలు చేపట్టే వరకు ఏక్ నాథ్ షిండే ఆపధర్మ సీఎంగా కొనసాగనున్నారు. అయితే, ఏక్ నాథ్ షిండే తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా మరోసారి మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరూ? ఫడ్నవీసేనా? అని చర్చిస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే ఆధ్వర్యంలో మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. అధిక సీట్లతో అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నది. గత పార్లమెంటు ఎన్నికల్లో కొంత నిరాశ కనబడినా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఊహించని విధంగా అత్యధిక స్థానాలు గెలిచారు. 233 సీట్లు గెలిచి ప్రతిపక్ష పార్టీలను మట్టి కురిపించాయి. ఈ ఫలితాలపై పలువురు మహాయుతి గెలుపునకు కారణం రెండు విషయాలను ప్రధానంగా చెబుతున్నారు. అవేమంటే.. మొదటిది ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించారని, హామీలను కూడా ప్రజలకు మేలు చేసే విధంగా పలు సంచలన హామీలు ఇచ్చారని చెబుతున్నారు. రైతులకు మేలు చేసే విధంగా పథకాలను అమలు చేస్తామని, సామాన్య జనానికి ఉపయోగపడే విధంగా పథకాలను అమలు చేస్తామంటూ హామీ ఇవ్వడంతోనే ఈ విజయం సాధ్యమైందని చెబుతున్నారు. మరో విషయమేమంటే.. మహాయుతి కూటమిలో ఉన్నటువంటి బీజేపీ, అజిత్ పవార్ ఎన్సీపీ, ఏక్ నాథ్ షిండే శివసేన పార్టీలు ఒక్కధాటిపై తమ కూటమిని గెలిపించుకోగలిగారని చెబుతున్నారు. గతంలో జరిగిన లోపాలను సవరించుకుని ఈ ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇచ్చారని, మొత్తంగా మహారాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారనో అనేది వారు అంచనా వేయగలిగారని.. అందుకే మహాయుతి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇదంతా ఒక ఎత్తు అయితే, మరో అంశంపై ప్రస్తుతం భారీగా చర్చ నడుస్తుంది. ఎన్నికల ఫలితాలు విడుదలై మహాయుతి గెలిచిందని తెలియగానే, తదుపరి సీఎం ఎవరు అనేదానిపై చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా నడుస్తుంది. సంబరాలు చేసుకున్న మహాయుతి కూటమి పార్టీలు కూడా ఇదే విషయాన్ని అంచనా వేసుకున్నాయి. ఆ పార్టీ నేతలు కూడా ఒకరికొకరు చర్చలు జరుపుతున్నారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు కూడా ఇదే విషయమై చర్చిస్తున్నారు. ప్రస్తుతమున్న ఏక్ నాథ్ షిండేను రెండోసారి సీఎంగా కొనసాగిస్తారా? లేక ఫడ్నవీస్ కు మరోసారి అవకాశం కల్పిస్తారా? లేదా ఎన్సీపీ లీడర్ అజిత్ పవార్ కు అవకాశం కల్పిస్తారా? అని అంతా చర్చిస్తున్నారు. అంతేకాదు.. ఈ ముగ్గురిలో ఎవరికి అవకాశం కల్పిస్తారు.. ఎవరికి అవకాశం కల్పించినా మిగతా ఇద్దరు ఇలాగే కలిసి ఉంటారా..? లేదా భవిష్యత్తులో ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తారా? అనే అంశంపై చర్చలు కూడా చేస్తున్నారు.

బీజేపీ మాత్రం చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందంటా. మహారాష్ట్రపై ఏ మాత్రం పట్టు సడలకుండా ఉండేందుకు నిర్ణయం తీసుకోవాలని జాతీయ నేతలు, మహారాష్ట్ర నేతలతో చర్చల మీద చర్చలు జరుపుతుందని చెబుతున్నారు. అందులో భాగంగా సీఎం ఏక్ నాథ్ షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్ లను బీజేపీ హైకమాండ్ ఢిల్లీకి పిలిచి చర్చలు జరిపింది. ఈ చర్చల్లో సీఎంను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ కు మరోసారి అవకాశం కల్పించారని చెబుతున్నారు. అందులో భాగంగానే నేడు సీఎం ఏక్ నాథ్ షిండే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారని చెబుతున్నారు. బీజేపీ ఎత్తులకు పై ఎత్తు వేస్తుంది కాబట్టి ఎన్సీపీ నేత అజిత్ పవార్ కు కూడా అవకాశం ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు చెబుతున్నారు. అజిత్ కు అవకాశం కల్పిస్తే కూటమిలో సమ ప్రాధాన్యత కల్పించినట్లు అవుతుందని, దీంతో కూటమి భవిష్యత్ లో విడిపోకుండా ముందుకు వెళ్తుందనే భావనలో కూడా బీజేపీ ఉండొచ్చని అంటున్నారు. ఎన్నికల్లో పెద్ద పాత్రను పోషించి తన పంథాను నెగ్గించుకున్న బీజేపీ ఏ నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చూడాలి మరి ఎవరు మహాకు సీఎం అవుతారనేది.

# ఏడాది పొడవునా రాజ్యాంగ దినోత్సవ సంబరాలు

## ప్రజలలో చైతన్య కార్యక్రమాలు

### కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ సంచాలకులు కోటేశ్వర్ రావు







**కోదాడ, మహా :** రాజ్యాంగ విలువలు, హక్కులపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ఏడాదిపాటు జాతీయ రాజ్యాంగ దినోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ జిల్లా సహాయ సంచాలకులు జి. కోటేశ్వర రావు తెలిపారు. మంగళవారం కోదాడలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన 75 వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం. వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు నిండిన సందర్భంగా ఏడాది పొడవునా అమృత మహోత్సవాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజ్యాంగ నిర్మాతల సేవలను స్మరించుకోవడంతో పాటు రాజ్యాంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం ఈ సంబరాలు లక్ష్యం అని చెప్పారు. ప్రతి విద్యాసంస్థ నుంచి మొదలు అన్ని గ్రామాల్లో రాజ్యాంగ హక్కులపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు ప్రజలకు పూర్తిగా చేరువై సమాన అవకాశాలు అందరికీ అందినప్పుడే సంపూర్ణ అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు రాజ్యాంగం అందించిన ఫలాలు సద్వినియోగం చేసుకొని సమాజ అభివృద్ధికి పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రాజ్యాంగం మౌలిక అంశాలు, ప్రత్యేకతలు గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాజ్యాంగ రచన పై ప్రదర్శించిన బుర్రకథ విద్యార్థులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో బోధనా సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీ సహా 4 రాష్ట్రాల్లో రాజ్యసభ ఖాళీలకు ఉపఎన్నికలు

## షెడ్యూల్ విడుదల.. ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ

### మరో మూడు రాష్ట్రాల్లో మూడు ఖాళీలు

### డిసెంబరు 20న పోలింగ్.. అదే రోజున ఓట్ల లెక్కింపు




**న్యూఢిల్లీ, మహా :** ఏపీ సహా నాలుగు రాష్ట్రాల్లో ఆరు రాజ్యసభ ఖాళీలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏపీ, ఒడిశా, బెంగాల్, హర్యానా రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాలకు సంబంధించిన షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం నేడు విడుదల చేసింది. రాజ్యసభ ఉప ఎన్నికలకు డిసెంబరు 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు తుది గడువు డిసెంబరు 10. డిసెంబరు 11న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబరు 13 తుది గడువు అని షెడ్యూల్ లో పేర్కొన్నారు. అవసరమైతే డిసెంబరు 20వ తేదీన పోలింగ్ జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనుండగా, అదే రోజున ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటించనున్నారు. ఏపీలో ఖాళీగా ఉన్న 3 రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్య రాజీనామాలు చేయడంతో రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. షెడ్యూల్ వెల్లడి కావడంతో ఏపీ టీడీపీ నేతల్లో కొంత మంది తమ ప్రయత్నాలను వేగవంతం చేశారు. అధినేత చంద్రబాబునాయుడు, కూటమి నేతలు పవన్ కళ్యాణ్, పురందేశ్వరిల ప్రసన్నం కోసం ప్రయత్నాలను మొదలు పెట్టారు.

# రేవంత్ నియంత పోకడలకు ఇదే నిదర్శనం: కవిత

**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నియంతృత్వ పోకడలకు పోతున్నారని అన్నారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. గిరిజన హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్ ను పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఆమె స్పందిస్తూ నెట్టింటా పోస్ట్ పెట్టారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే రాజ్యాంగ హక్కులను రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలరాస్తున్నదంటూ కవిత విమర్శించారు. మృతిచెందిన విద్యార్థిని కుటుంబ సభ్యులను ఓదార్చడానికి వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం సరికాదంటూ ఆమె అందులో పేర్కొన్నారు.

### ప్రముఖ జర్నలిస్ట్, గేయ రచయిత

# కులశేఖర్ కన్నుమూత



**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ లో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ కన్నుమూశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం తుది శ్వాస విడిచారు. కుల శేఖర్ ది ఏపీలోని వైజాగ్. సినీ గేయ రచయిత కంటే ముందుగా ఆయన హైదరాబాద్ లో జర్నలిస్టుగా పనిచేశారు. ఆ తరువాత గేయ రచయితగా మారారు. పలు ప్రముఖ చిత్రాలకు కులశేఖర్ పాటలు రాశారు. ఘర్షణ, నువ్వు నేను, భద్ర, జయం, సైనికుడు, సంతోషంతోపాటు పలు సినిమాలకు ఆయన పాటలు రాశారు.

# హైదరాబాద్‌లో మరో భారీ పెట్టుబడి

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. వేలాది ఉద్యోగాలు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మహానగరంలో మరో భారీ పెట్టుబడి వస్తోంది. దేశవ్యాప్తంగా ఎంతగానో పేరుగాంచిన.. అంబర్‌రెసోజెట్ సంస్థ తెలంగాణ రాష్ట్రంలో మరో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. రూ. 250 కోట్లతో రాష్ట్రంలో కొత్త తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన ఈ సంస్థ, ఇప్పటికే ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. అంబర్‌రెసోజెట్ పరిశ్రమ ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీదారుగా దేశవ్యాప్తంగా పేరు పొందింది. రూమ్ ఏసీలు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్లు వంటి పరికరాలకు ఈ సంస్థ ప్రముఖ ప్రమోటర్‌గా గా ఉంది. హైదరాబాద్‌ను ఈ పరిశ్రమ కొత్త ప్రాజెక్టుకు డెస్టినేషన్ గా ఎంచుకోవడం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ ప్లాంట్ ఏర్పాటుతో వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఈ సంస్థ ఏర్పాటుతో ప్రత్యక్షంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగాలు లభించనున్నాయని ప్రభుత్వం చెబుతోంది. కంపెనీకి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం నుంచి అందిస్తామని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు ) ఉత్పత్తి కేంద్రం కూడా త్వరలో హైదరాబాద్‌లో ఏర్పాటు కానుంది. వందేభారత్ రైళ్లు, మెట్రో రైళ్లు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు అవసరమైన ఎయిర్ కండిషనింగ్ పరికరాల తయారీలో ఈ సంస్థకు ప్రత్యేక స్థానం ఉందని మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ ప్రాజెక్ట్ మరింత పరిశ్రమలను ఆకర్షించే దిశగా ప్రోత్సాహకరంగా నిలుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**ఇబ్రహీంపట్నం:** నవంబర్ 26 మహా: భారత రాజ్యాంగ నిర్మాత, రాజ్యాంగ రూపకర్త మహనీయుడు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పోచారం గ్రామంలో ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. భారత రాజ్యాంగం ఏర్పాటై ఆమోదం పొంది 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, పోచారం గ్రామంలో మంగళవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్పూర్తితోనే రచించిన రాజ్యాంగం ద్వారానే ఈరోజు ఎమ్మెల్యేగా మీ ముందు ఉన్నానని, దేశంలో, రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా ప్రజల ఓట్లతో గెలిచిన వ్యక్తులు, ప్రమాణ స్వీకారం చేసే సమయంలో భారత రాజ్యాంగం పట్ల అంతఃకరణ శ్రద్ధతో ఉంటామని ప్రతిజ్ఞ చేసి ప్రమాణ స్వీకారం చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన దేశ ప్రజల కోసమే రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. ఏ ఒక్కరి కోసం ఈ రాజ్యాంగాన్ని రచించలేదని సమాజంలోని బడుగు బలహీన పేద, పెద్ద సబండ జాతుల వారిని దృష్టిలో పెట్టుకొని, ఈ రాజ్యాంగాన్ని రచించడం జరిగిందని అన్నారు. కొందరు వ్యక్తులు రాజ్యాంగం స్ఫూర్తితో ఎమ్మెల్యేలుగా ముఖ్యమంత్రులుగా పదవులు అనుభవించి రాజ్యాంగాన్ని మార్చేస్తామనడం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని మార్చడం ఏ ఒక్కరి తరం కాదని ఇది ప్రజాస్వామ్య దేశం ప్రజల ఆశయాల కోసమే ఏర్పడిన రాజ్యాంగం. కేంద్ర ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా సేవలందించిన ఆయన ఎల్లప్పుడూ ప్రజల క్షేమం కోసమే ఆలోచించే మహనీయుడు. అట్టడుగు వర్గాల వరకు చదువు అందే విధంగా ప్రభుత్వంలో ఉండి న్యాయపోరాటం చేసిన గొప్ప ప్రజ్ఞాశీలి, ప్రతి ఒక్కరికి విద్య విద్యతోనే హక్కుల సాధన జరుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరు చదువుకుంటే జ్ఞానం వస్తుంది, జ్ఞానం వస్తే వివేకంతో ఆలోచిస్తారని వాళ్లకు రావాల్సిన హక్కులను సాధించుకుంటారని ప్రజల తరపున పోరాటం చేశారని అన్నారు. భవిష్యత్తులో ఇంకెవరైనా రాజ్యాంగం పట్ల అవహేళనగా మాట్లాడితే తగిన శాస్తి జరుగుతుందని, ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికే గొప్ప వ్యక్తి అంతటి మహానుభావుడు మరల మనకు లేదు కనుక నాటి తరం వాళ్ళమైన మనం నేటి తరానికి ఆయన దేశానికి చేసిన సేవలను ఆయన యొక్క ఆశయాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు, మహిళలు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

# ఎంత జనాభాకు అంత భాగస్వామ్యం

## తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల సర్వే 92 శాతం పూర్తి

### సంవిధాన్ రక్షక్ అభియాన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా కుల గణన అనేది కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాధించే సామాజిక న్యాయం మూడో ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రథమ ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ నుంచి ఇందిరా గాంధీ వరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, బ్యాంకుల జాతీయీకరణ వంటి కార్యక్రమాలతో సామాజిక న్యాయం మొదటి దశ సాధిస్తే... రాజీవ్ గాంధీ హయాంలో 18 ఏళ్లకే ఓటు హక్కు.. మండల్ కమిషన్ నివేదిక వంటి కార్యక్రమాలతో సామాజిక న్యాయం @ 2.0 పూర్తయిందని.. ఇప్పుడు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీల ఆధ్వర్యంలో కుల గణనకు సామాజిక న్యాయం@ 3.0 ప్రారంభమైందన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ మహా యుద్ధం ప్రకటించారని... ఆయన బాటలో నడుస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సామాజిక, ఆర్థిక, కుల సర్వే మొదలుపెట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో సర్వే 92 శాతం పూర్తయిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీ తలకటోరా స్టేడియంలో మంగళవారం నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణలో కుల సర్వే పూర్తి కాగానే తాము సామాజిక న్యాయం మూడో మహా యుద్ధాన్ని ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జితని భాగి దారి.. ఉతని హిస్సే దారి.. కచ్చితంగా అమలు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. పదేళ్లుగా దేశంలో రాజ్యాంగం ప్రమాదం లో ఉందని, రాజ్యాంగ రక్షణకు రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టారన్నారు. రాహుల్ చేపట్టిన ఉద్యమంలో ప్రజలు భాగస్వాములైనందునే మోదీ 400 వందల సీట్లు అడిగితే ప్రజలు కేవలం 240 సీట్లకు పరిమితం చేశారని సీఎం అన్నారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ప్రజలు ఓడిస్తున్నారని.. వయనాడ్, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలో బీజేపీ కూటమి గెలిస్తే, ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి గెలిచిందన్నారు. రాజ్యాంగ రక్షణ ఉద్యమం కేవలం రాహుల్ గాంధీకి పరిమితమైన అంశంగా అనుకోవద్దని, మనమంతా అందులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుత పోరాటం రాజ్యాంగ రక్షకులు... రాజ్యాంగ శత్రువుల మధ్యనే ఉందని గుర్తుంచుకోవాలన్నారు. మహాత్మా గాంధీ పరివార్ రాజ్యంగ రక్షణకు పూనుకుంటే... మోదీజీ పరివార్ అంటే సంఘ్ పరివార్ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని సీఎం విమర్శించారు.



## మేనల్లుడికి అదనపు బాధ్యతలు

# అప్పగించిన దీదీ

**మహా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజకీయాల్లో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తుంటారు. సంచలన నిర్ణయాలతో ప్రత్యర్థులను హడలెత్తిస్తుంటారు. తాజాగా కూడా మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడైన ఎంపీ అభిషేక్ బెనర్జీకి మమత మరింత ప్రాధాన్యం ఇచ్చారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనకు దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ ప్రాధాన్య అంశాలపై గళమెత్తే అదనపు బాధ్యతను అప్పగించారు. మమత బెనర్జీ తాజా నిర్ణయంతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యాన్ని జాతీయ రాజకీయాల్లో పెంచుకోవడంతో పాటు ప్రత్యేకంగా ఢిల్లీలో అభిషేక్ కు ప్రాధాన్యత ఏర్పడే విధంగా వ్యూహరం రచించారని అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అదేవిధంగా పలువురు సీనియర్ నేతలకు కూడా పార్టీలో పలు పదవులను కట్టబెట్టారు.

EDITORIAL ఎడిటోరియల్

# జమ్మూ కాశ్మీర్ చరిత్రలో కొత్త అధ్యాయం

భారతదేశ చరిత్రలో ఓ అపూర్వ అరుదైన ఘట్టం మంగళవారం జరిగింది. నవంబర్ 26, 1950న రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. జమ్మూ కాశ్మీర్ భారత్‌లో విలీనమైన తర్వాత ఇలాంటి ఘటన జరగడం ఇదే తొలిసారి. ఈ రోజును జమ్మూ కాశ్మీర్‌లో రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించారు. ఇది జమ్మూ కాశ్వీర్ చరిత్రలో సువర్ణ అధ్యాయమే. శ్రీనగర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నాయకత్వం ఘనంగా రాజ్యాంగ దినోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్‌తో పాటు మంత్రులు కూడా పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తి కావడం ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నవేళ జమ్మూ కాశ్మీర్‌పై అందరి చూపు ఉంది. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రధాన విలువలను పునరుద్ఘాటించడానికి, పౌరులు తమ సరైన పాత్రను పోషించేలా ప్రేరేపించడానికి ఈ కార్యక్రమాన్ని గొప్ప ఉత్సాహంతో జరుపుకోవాలని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ పిలుపునిచ్చారు. హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్ అంటూ 75 సంవత్సరాల జ్ఞాపకార్థం సంవత్సరానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది అని ప్రభుత్వం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నేతృత్వంలో శ్రీనగర్‌లో ఏకకాలంలో పీఠిక పఠన వేడుకను నిర్వహించారు. అలాగే జమ్మూ, కాశ్మీర్‌లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్వయంప్రతిపత్త సంస్థలు, విద్యా సంస్థలు ఇలాంటి వేడుకలను నిర్వహించాయి. అక్టోబర్ 16న జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఒమర్ అబ్దుల్లా భారత రాజ్యాంగానికి విధేయుడిగా ప్రమాణం చేసిన మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. అతని మునుపటి 17 మంది ముఖ్యమంత్రులు జమ్మూ కాశ్మీర్ రాజ్యాంగానికి విధేయత చూపుతూ ప్రమాణం చేయడం విశేషం. జమ్మూ , కాశ్మీర్ దాని స్వంత రాజ్యాంగం ఎజెండాతో ఇంతకాలం పనిచేసింది. 1965లో దాని ప్రభుత్వాధినేత ప్రధానమంత్రిగా, దేశాధినేత సదర్‌ఎరియాసత్ (అధ్యక్షుడు)గా నియమితులయ్యారు. అయితే, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయే వరకు రాజ్యాంగం, ఎజెండా అమలులో ఉన్నాయి. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రాన్ని లడఖ్‌తో సహా కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని భారత రాజ్యాంగం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, రాజ్యాంగం ప్రాముఖ్యత, అంబేద్కర్ ఆలోచనలు, భావనలను వ్యాప్తి చేసే లక్ష్యంతో జరుపుకుంటారు. మన దేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారు. నిజానికి 1949లో ఇదే రోజున భారత రాజ్యాంగం ఆమోదించడం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో మన రాజ్యాంగాన్ని రూపొందించడానికి రెండు సంవత్సరాల, 11 నెలల 18 రోజులు పట్టింది. ఆ తర్వాత రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రాజ్యాంగం 26 జనవరి 1949న తయారు చేయడం జరిగింది. అయితే ఇది అధికారికంగా 26 జనవరి 1950న అమలులోకి వచ్చింది. ప్రతి సంవత్సరం ఆ రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. ఇపుడు రాజ్యాంగం ఏర్పడి 75ఏళ్ళు అయిన సందర్భంగా దేశవ్యాప్త ఉత్సవాల్లో జమ్మూకాశ్మీర్ కూడా భాగమైంది.





# మహా కుంభమేళాకు ఏర్పాట్లు

## తొలిసారి రోబోల వినియోగం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మరికొన్ని రోజుల్లో జరగనున్న మహా కుంభమేళా కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు రానున్న నేపథ్యంలో మహా కుంభమేళాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే భద్రత, ఇతర తక్షణ అవసరాల కోసం పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ డిపార్ట్‌మెంట్‌లను సర్కార్ అలర్ట్ చేస్తోంది. అయితే ఎప్పుడూ లేని విధంగా ఈసారి మహా కుంభమేళాలో తొలిసారి రోబోలను వినియోగిస్తున్నారు. కుంభమేళాలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా రోబోటిక్ ఫైర్ టెండర్లను అధికారులు రంగంలోకి దించారు. వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న ఈ మహా కుంభమేళాలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోబోటిక్ ఫైర్ టెండర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీటితోపాటు మరో 200 ఫైర్ కమాండోలను కూడా అందుబాటులో ఉంచనున్నట్లు ఉత్తర్‌ప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ పద్మజా చౌహాన్ వివరించారు. ఇక ఎమర్జెన్సీ సమయాల్లో ఫైర్ సిబ్బంది వెళ్లలేని ప్రాంతాలకు వెళ్లి.. బాధితులను రక్షించేందుకు 3 రోబోటిక్ ఫైర్ టెండర్లను ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఇక ఈ ఒక్కో రోబోటిక్ ఫైర్ టెండర్ 20 నుంచి 25 కిలోల బరువు ఉంటుందని.. ఇవి మెట్లు ఎక్కడంతో పాటు మంటలను కూడా అదుపులోకి తీసుకువస్తాయని పేర్కొన్నారు. అంతే కాకుండా 35 మీటర్ల ఎత్తు నుంచి నీటిని స్ప్రే చేసే ఆర్టిక్యులేటింగ్ వాటర్ టవర్‌లు.. అత్యాధునిక టెక్నాలజీ కలికి ఉన్న కెమెరాలను కూడా మహా కుంభమేళాలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ తరహాలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఎస్టీఆర్‌జీని ప్రారంభించినట్లు ఏడీజీ పద్మజా చౌహాన్ తెలిపారు. ఈ యూనిట్‌లో ఎన్డీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ హైదరాబాద్‌లో శిక్షణ పొందిన 200 మంది సిబ్బంది ఉన్నట్లు వివరించారు. వారిని కుంభమేళా సమయంలో హై రిస్క్ జోన్ ప్రాంతాల్లో మోహరించనున్నట్లు వెల్లడించారు. ఇక గతంలో జరిగిన కుంభమేళాలో అగ్నిమాపక సేవల కోసం రూ.6 కోట్లను కేటాయించగా ఈసారి భారీగా పెంచినట్లు చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న మహా కుంభమేళాలో అగ్నిమాపక సేవల కోసం రూ.67 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.



### మహా కుంభమేళా 12 ఏళ్ళకోసారి

ప్రతి మూడేళ్ళకు ఒకసారి కుంభమేళాను నిర్వహిస్తూ ఉంటారు. ఇక 6 ఏళ్లకు ఒకసారి అర్ధ కుంభమేళాను జరుపుతారు. కానీ మహా కుంభమేళా అంటే మాత్రం.. ప్రతీ 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. గతంలో మహాకుంభ మేళాను 2013లో నిర్వహించగా.. ఆ తర్వాత 2019లో అర్ధకుంభ మేళా ఉత్సవాలను చేశారు. ప్రస్తుతం 2025లో మహాకుంభ మేళాను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం అవుతున్నాయి. ఈ మహాకుంభ మేళా 2025 ఉత్సవాలు.. వచ్చే ఏడాది జనవరి 29వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధియోగాలో నిర్వహించనున్నారు. జనవరి 13వ తేదీన ప్రారంభం కానున్న ఈ మహా కుంభమేళా.. ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది.

# బెల్లం టీ ఆరోగ్య ప్రయోజనాలు తెలుస్తే

## మహిళలు ఖచ్చితంగా ఇదే తీసుకుంటారు!

బెల్లం టీ, సంప్రదాయ ఆయుర్వేద పానీయాలలో ఒకటి. ఇది రుచికరమైనది, ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉండేది. బెల్లం, టీ ఆకులతో కలిపి తయారు చేసే ఈ టీ, సుగంధ ద్రవ్యాలుతో తయారు చేయబుతుంది. ఇది రుచినీ అందిస్తుంది. బెల్లం టీ తయారీ విధానం, దాని ఆరోగ్య ప్రయోజనాలు, తాగడానికి సరైన సమయాలు వంటి వివరాలను తెలుసుకుందాం



### బెల్లం టీ ఆరోగ్య ప్రయోజనాలు:

**1. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది:**
బెల్లంలో ఉండే పొటాషియం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను నివారించడంలో కూడా సహాయపడుతుంది.

**2. రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**
బెల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఇది జలుబు, దగ్గు వంటి సాధారణ వ్యాధులను నివారించడంలో కూడా సహాయపడుతుంది.

**3. శక్తిని పెంచుతుంది:**
బెల్లం ఒక సహజ శక్తివంతమైనది. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది.

**4. రక్తహీనతను నివారిస్తుంది:**
బెల్లంలో ఉండే ఐరన్ రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది.

**5. నొప్పిని తగ్గిస్తుంది:**
బెల్లంలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

**6. శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది:**
బెల్లం శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శీతాకాలంలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**7. ఆరోగ్యకరమైన చర్మానికి:**
బెల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

**8. పీరియడ్స్ నొప్పి:**
బెల్లం టీ తాగితే పీరియడ్స్ సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చని వైద్య నిపుణులు అంటున్నారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# ప్రశ్నించే హక్కును రాజ్యాంగం ఇచ్చింది

**▪ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**






**ములుగు, మహా:** రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమాన హక్కులను కల్పించే భారత రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారని, ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ములుగు, గోవిందరావుపేట మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పులకు శంకుస్థాపన చేశారు. మొదట 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగులోని బస్టాండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇంచర్ల జీపీ పరిధి ఎర్రిగట్టమ్మ వద్ద ఎన్హెచ్ 163 నుంచి సీఆర్పీఎఫ్ బెటాలియన్ క్యాంపు వరకు రూ.35లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.50లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, ఇంచర్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన జీపీ నూతన భవన నిర్మాణ పనులను కలెక్టర్ దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ములుగు జిల్లా కేంద్రములో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. గోవిందరావుపట మండలం చల్వాయి గ్రామంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఆర్ జీఎస్ పథకంలో కూలీలుగా పనిచేసిన వారిని సన్మానించారు. అదేవిధంగా చల్వాయి గ్రామంలో రూ .12లక్షల అంచనా వ్యయంతో నూతన అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతీ ఒక్కరికీ ప్రశ్నించే హక్కు, భావస్వేచ్ఛ హక్కులను కల్పించిందని, అంబేద్కర్ గొప్ప మేధా శకత్ఇ కలిగిన మహనీయుడు అన్నారు. పండిత్ జవహర్లాల్, సర్దార్ వల్లభాయ్ పటేల్ లతో కలిసి పార్లమెంట్లో ఆమోదింప చేశారని, కొంతమంది వ్యక్తులు రాజ్యాంగ చట్టాలను తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేస్తుందని, రానున్న రోజుల్లో రైతు బంధు, రైతు భరోసా, మహిళలకు రూ.2500ల పింఛన్ పెంపు పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణించడం కొందరికి నచ్చడం లేదని విమర్శించారు. జనవరి మాసం నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సన్నవడ్లు పండించిన రైతులకు రూ.500ల బోనస్ సైతం ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇప్పటికే రూ.18వేల కోట్లను రైతు రుణమాఫీ పథకంలో పంపిణీ చేశామని, రానున్న రోజుల్లో మరో రూ.10వేలకోట్లు కేటాయించి రుణమాఫీ కానీ రైతులకు అందిస్తామని అన్నారు. గత పాలకులు చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికేరాష్ట్రంలోనిరుద్యోగులకు 53వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, త్వరలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని అన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు : మంత్రి సీతక్క

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని మంత్రి సీతక్క సూచించారు. రైతులకు బోనస్ ఇస్తే ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బిఆర్ఎస్ కు ప్రజలు బుద్ధి చెప్పినా వారిళ్ళ బుద్ధి మారటం లేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.2700ల కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, ఎన్ఆర్ఈజిఎస్ పథకం ద్వారా విడుదల అవుతున్న నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎస్ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటి సంస్థ సౌజన్యం తో 10కంప్యూటర్లతో కూడిన ల్యాబ్ను ప్రారంభించారు. అనంతరం చల్వాయిలో అంగణ్వాడీ నూతన భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు మూడు, ఆరేళ్ల లోపు చిన్నారులకు మనో వికాస కేంద్రాలని, ఈ ప్రాంతంలోని పిల్లల పూర్వ ప్రాథమిక విద్యా వ్యవస్థకు శాశ్వత భవనాల నిర్మాణం మైలురాయిగా నిలుస్తుందన్నారు. ములుగు జిల్లాలో మొదటి దశలో రూ.2కోట్ల 16లక్షల నిధులతో 18నూతన అంగన్వాడీ భవనాలను నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి వివిధ మౌలిక వసతుల కల్పన కోసం రూ.91లక్షల 72వేల బడ్జెట్ మంజూరీ చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, సంపత్ రావు, డీడబ్ల్యూవో కె.శిరీష, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రాజు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు జన్ను రవి, బెటాలియన్ డిప్యూటి కామాండెంట్ ఎన్పి.రజిత, అసిస్టెంట్ కామాండెంట్ చామి నారాయణ, సుబేదార్ మేజర్ మని బాబు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రహీం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**కొత్తగూడెం, నవంబర్ 26, మహా:** ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగానికి ప్రపంచ దేశాలలో ఎంతో గుర్తింపు ఉన్నదని, మనమంతా రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు సమర్ధవంతంగా సేవలందించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికి ప్రాథమిక హక్కులను కల్పించడంతోపాటు ప్రజల ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుని చట్టాలను సైతం పొందుపరిచారని చెప్పారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యాలుగా ఏర్పడిన పోలీస్ వ్యవస్థలో ఉన్న మనమంతా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు పోలీసు అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు చంద్రభాను, రెహమాన్, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఎస్బీ ఇన్స్పెక్టర్ నాగరాజు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ అభివృద్ధి పనుల పరిశీలన



**అశ్వారావుపేట, నవంబర్ 26, మహా:** అటవీ రక్షణ, అభివృద్ధి ప్రాధాన్యతగా భద్రాద్రి సీసీఎఫ్, డీఎఫ్ఓ, పాల్వంచ ఎఫ్డీఓ అశ్వారావుపేట రేంజ్ పరిధిలో మంగళవారం నర్సరీని సందర్శించి, అటవీ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అటవీ భూములు మరియు కలప అక్రమ దందాలు జరిగేందుకు వీల్లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షణ కోసం ఘస్తీ పెంచాలని, వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణ, నాణ్యమైన మొక్కల పెంపకానికి దృష్టి పెట్టాలని సూచించిన అధికారులు, ప్రదేశంలో ప్రకృతి సమతుల్యత కాపాడేందుకు సంబంధిత చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అటవీ అభివృద్ధి పనులు సమయానికి పూర్తి చేసి, దీని ద్వారా ప్రజలకు ప్రకృతి రక్షణ ప్రాధాన్యతను తెలియజేయాలని పేర్కొన్నారు. అటవీ భూములను ఆక్రమణల నుండి రక్షించడమే కాకుండా, సమీప గ్రామ ప్రజలు అటవీ సంరక్షణలో భాగస్వాములు కావాలని ప్రోత్సహించారు. పర్యావరణానికి మేలుచేసే విధంగా నర్సరీల అభివృద్ధి, మొక్కల పంపిణీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

## ప్రైవేట్ హాస్పిటల్ ఫీజుల దోపిడీని అరికట్టాలి



**ఖమ్మం సిటీ, నవంబర్ 26, మహా:** ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ హాస్పిటల్ బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్ పీఓడబ్ల్యూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తలపెట్టింది. అందులో భాగంగా మంగళవారం పీఓడబ్ల్యూపీవైఎల్ బృందం ఖమ్మంలోని పలు ప్రైవేట్ హాస్పటల్లో సర్వే చేసి రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యం అందకపోవడంతో ప్రజలు తప్పని పరిస్థితిలో ప్రైవేట్ హాస్పిటల్స్ ను ఆశ్రయిస్తున్నారని వారు అన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. టెస్టుల పేరుతో, మందుల పేరుతో ఆపరేషన్ల పేరుతో లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారని అన్నారు. అలానే ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లపై మెడికల్ మాఫియాపై ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ పై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సర్వేలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి, పివైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోకినపల్లి లలిత, ఆవుల మంగతాయి, జిల్లా సహాయ కార్యదర్శి శోభ, పీవైఎల్ నాయకులు గొడ్డేటి అశోక్ రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**▪ రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ కృష్ణన్**



**ముదిగొండ, నవంబర్ 26, మహా:** ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి కావాలని రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ ఎంఏ కృష్ణన్ అన్నారు. మండల పరిధిలోని పండ్రేగుపల్లి, న్యూలక్ష్మీపురం, ముదిగొండలో ఆయన మంగళవారం పర్యటించారు. భారత రాజ్యాంగ దినోత్సవం, ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల సందర్భంగా ఎన్ఆర్ఈజీఏస్ నిధులు రూ. 3 లక్షలతో నిర్మితమయ్యే కోళ్ల ఫామ్ కు, ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఇంకుడు గుంత నిర్మాణానికి ఆయన లాంఛనీయంగా శంకుస్థాపన చేశారు. అనంతరం న్యూలక్ష్మీపురం నర్సరీని సందర్శించి నర్సరీలో పెంచే వివిధ మొక్కలను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఆర్డీఏ ఏపీడీ చుంచు శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్ శ్రీధర్ స్వామి, ఈజీఎస్ ఏపీఓ అడపాల రంగనాయకమ్మ, ఐకేపీ ఏపీఎం సీహెచ్ కల్పన, ఈజీఎస్ ఈసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ కార్యాలయం సూపరిటెంట్ బండి భాస్కర్ రావు, న్యూలక్ష్మీపురం గ్రామ పంచాయితీ సెక్రటరీ సురేష్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గోపీ స్వరూపరాణి, ఈజీఎస్ టీఏలు రమేష్, నరేష్, నగేష్ గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో సమస్యలు ఎదుర్కొని విజయం సాధించాలి




**ఖమ్మం సిటీ, నవంబర్ 26, మహా:** ఖమ్మం నగరంలోని సాహితీ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో తెలంగాణా గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ నిర్వహణలో రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివాస్) ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా శ్రీ రక్షా ఫౌండేషన్ చైర్మన్, శ్రీరక్ష హాస్పిటల్ అధినేత డా. గోంగూర వెంకటేశ్వర్లు(జి.వి), సీనియర్ అడ్వకేట్ బిచ్చాల తిరుమల రావు పాల్గొని ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా డా.గోంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం అని, చట్టం ముందు అందరూ సమానులే అని తెలియచేశారు. సీనియర్ అడ్వకేట్ బిచ్చాల తిరుమల రావు మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల గురించి, రాజ్యాంగంలోని ఆర్టికల్స్ గురించి తెలుసుకోవాలన్నారు. చదువు వల్లనే సమాజంలో గౌరవం పెరుగుతుందని, ఉన్నత స్థాయిలోకి రావడానికి ఎన్నో అవకాశాలు మన దేశంలోనే ఉన్నాయని, క్రమశిక్షణ, అంకిత భావంతో కష్టపడితే లక్ష్యాలు చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మేకల సుగుణారావు, సాహితీ జూనియర్ కళాశాల చైర్మన్ కె.నాగేశ్వర్ రావు, కరెస్పాండెంట్ శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ వెంకన్న, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ చైర్మన్ కోడిరెక్క ఉమా శంకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 29 క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ కొరకు చివరి తేదీ

**ఖమ్మం, నవంబర్ 26, మహా:** ఇంటర్మీడియట్ ఎం.పీ.హెచ్.డబ్ల్యూ (ఫిమేల్ ) ఒకేషనల్ కోర్సుల లో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు ఆసుపత్రి పేరునా డీడీ రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకొని ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు మంగళవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 29 లోగా అందజేయాలని రవి బాబు ఆ ప్రకటనలో తెలిపారు.

## నవంబర్ 28న జాబ్ మేళా

**ఖమ్మం, నవంబర్ 26, మహా:** జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఖమ్మంలోని సర్వగ్రాం ఫైనాన్స్ కంపెనీలో బ్రాంచ్ రిలేషన్షిప్ అధికారి(20) పోస్టులకు, సికింద్రాబాద్ లోని కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రైవేట్ కంపెనీలో హాస్పిటల్ బిల్లింగ్ (25) పోస్టులకు, జీడీఏ నర్సింగ్ అసిస్టెంట్ (10) పోస్టుల్లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 28న గురువారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక కాబడినవారికి 12 వేల నుండి 22 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని, 18 నుండి 29 వయస్సు గల, ఆసక్తి, అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 8247255859 నందు సంప్రదించాలన్నారు.

## రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో మాజీ ఎంపీ నామా



**ఖమ్మం, నవంబర్ 26, మహా:** భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 1949 నవంబర్ 26న ఆమోదం పొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చి, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సామరస్యానికి మార్గదర్శకంగా డా. బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి అద్భుతమైన మార్గదర్శకమన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రూపకర్తలను స్మరించడం మన బాధ్యత అని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3తోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమైందని గుర్తుచేశారు.

## విద్యార్థులకు ఉచిత కోచింగ్

**▪ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సత్యనారాయణ**

**ఖమ్మం, నవంబర్ 26, మహా:** విదేశాలకు వెళ్లి చదవాలనుకునే మైనార్టీ(ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్శి, బౌద్ధులు) విద్యార్థుల కొరకు ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్, గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ఎస్ ఎ ఫారెన్ లాంగ్వేజ్ పరీక్షలకు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఆసక్తి, అర్హత గల మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబర్ 30 లోపు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, మూడవ అంతస్తు, జామియా నిజామియ భవన సముదాయం, గన్ ఫౌండ్రీ, ఆబిడ్స్, హైదరాబాద్ నందు సమర్పించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తెలిపారు.

## అభివృద్ధే నా లక్ష్యం: ఎమ్మెల్యే జారే



**అశ్వారావుపేట /దమ్మపేట, నవంబర్ 26, మహా:** నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం, సుందరీకరణకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. తనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తాను పట్టించుకోనని, అవి అనవసరమని వ్యాఖ్యానించారు. మంగళవారం మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన మన ఊరిలో పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, గండుగులపల్లి, మొద్దులగూడెం, దమ్మపేట, మందలపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ ప్రజారంజక పాలన కొనసాగిస్తోందని తెలిపారు. రైతుల రుణమాఫీ, సన్న రకం ధాన్యానికి బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంచడం వంటి పథకాలు ప్రజలకు పెద్దసాయం చేస్తున్నాయని అన్నారు. హామీలను నెరవేర్చడమే నా ధ్యేయం తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తానని, దమ్మపేట మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం, విస్తృత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, వరద ముంపు సమస్యల పరిష్కారం వంటి ప్రాజెక్టులు త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రత్యేకంగా, షాదీ ఖానా పరిసర ప్రాంతాల్లో బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని వెల్లడించారు. ప్రతిపక్షాలు తనపై చేస్తున్న విమర్శలు అసత్యమని, అవి తన పనితీరు విషయంలో ప్రజలలో ఎలాంటి సందేహాలు రాకుండా ప్రజలు తెలుసుకోవాలని చెప్పారు. నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

## బీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**కొత్తగూడెం, నవంబర్ 26, మహా:** ప్రతీ ఒక్కరు రాజ్యాంగాన్ని చదవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్ నందు జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున్ రావు అధ్యక్షతన జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ ఈ దేశ మూల వాసులైన బహుజనులకు మానవ హక్కులు నిరాకరించబడి జంతువుల కంటే హీనంగా చూడబడుతూ అంటరానితనం అసమానత వేళ్ళూని ఉన్న సమయంలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా మార్పును కోరుతూ ఎన్నో హక్కులను సాధించడం వల్లనే ప్రస్తుతం బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలైన బహుజనులకు మాత్రమే కాకుండా అగ్ర కులాలలోని పేదలకు, మహిళలకు కూడా హక్కులు కల్పించబడ్డాయన్నారు. 26 నవంబర్ 1949 భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఘనమైన రోజు అని, ప్రతీ భారతీయ పౌరుడు గర్వంగా నేటి రోజును భారత రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రాజ్యాంగేతర శక్తులు రాజ్యాంగం మీద విమర్శలు చేస్తూ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని, వారిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతీ వ్యక్తిపై ఉందని రాజ్యాంగాన్ని మన ప్రాణం కన్నా మిన్నగా కాపాడుకోవాలని, అంబేద్కర్ ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని, రాజ్యాంగంతోనే సామాజిక సాధికారత సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరు నాయక్, జిల్లా కోశాధికారి పీక మల్లికార్జునరావు, కొత్తగూడెం, పినపాక అసెంబ్లీల అధ్యక్షులు నాగుల రవికుమార్, పినపాక అసెంబ్లీ అధ్యక్షుడు పడమటి సత్య వరప్రసాద్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దు

**▪ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి**



**ఖమ్మం, నవంబర్ 26, మహా:** జిన్నింగ్ మిల్లులకు వచ్చే పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా నాణ్యమైన పత్తిని మద్దతు ధరపై కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ మండలం గుర్రాలపాడు గ్రామంలోని జి.ఆర్.ఆర్. ఇండస్ట్రీ, తల్లంపాడు గ్రామంలోని శ్రీ బాలాజీ, పొన్నెకల్ గ్రామంలోని జి.ఆర్.ఆర్. జిన్నింగ్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియ, ఎంత సమయం తీసుకుంటుంది, తేమ పరీక్షలకు సంబంధించిన అంశాలను రైతులను అదనపు కలెక్టర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 3 వేల 648 మంది రైతుల నుంచి 8 వేల 487 మెట్రిక్ టన్నుల పత్తి మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. రైతులు జిన్నింగ్ మిల్ వద్ద ఎదురుచూసే అవకాశం రానివ్వకుండా ఉదయం పూట వచ్చిన నాణ్యమైన పత్తిని ఆరోజే కొనుగోలు చేస్తున్నామని అన్నారు. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పత్తి పంట 8 శాతం తేమ ఉంటే క్వింటాళ్ల 7521 రూపాయల మద్దతు ధర వస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు పెరిగే ఒక్కో శాతానికి 75 రూపాయల చొప్పున క్వింటాకు మద్దతు ధర తగ్గించడం జరుగుతుందని, 12 కంటే ఎక్కువ తేమ శాతం ఉంటే కొనుగోలు చేయబోమని అదనపు కలెక్టర్ రైతులకు తెలిపారు. ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం, సీసీఐ ప్రతినిధి అవినాష్, మార్కెట్ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, వీరాంజనేయులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆదర్శ్, హిమబిందు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



**ఖమ్మం, నవంబర్ 26, మహా:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి బీఆర్ నాయుడుని శాలువాతో సత్కరించారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటర్ జాబితాలపై చర్చ



**సత్తుపల్లి, నవంబర్ 26, మహా :** జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటర్ జాబితాలపై చర్చించడానికి మండల పరిషత్ కార్యాలయంలో పలు పార్టీ నేతలు, పంచాయతీ కార్యదర్శులతో ఎం.పీ.డీ.వో సిహెచ్ చిన్న నాగేశ్వరరావు సమావేశం అయ్యారు. దీనిలో భాగంగా అనుబంధ ఓటర్ జాబితాలో 498 మంది ఓటర్లు ఉన్నారని, వారిని సంబంధిత కార్యదర్శుల ఆధ్వర్యంలో పంచాయతీ వార్డులలో చేర్చడం జరుగుతుందని, ఈ కార్యక్రమం పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని ఎంపీడీవో తెలిపారు. ఎంపీఓ టి.కృష్ణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 29న ఖమ్మంలో దీక్ష దివస్




**ఖమ్మం సిటీ, నవంబర్ 26, మహా:** బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నవంబర్ 29న ఖమ్మం జిల్లా కేంద్రంలో దీక్షా దివస్ కార్యక్రమాన్నినిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జి తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బానోతు చంద్రావతి, మాజీ జిల్లా పరిషద్ చైర్మన్ లింగాల కమల్ రాజ్, ఖమ్మం జిల్లా మాజీ జిల్లా డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల (ఆర్ జె సి) కృష్ణలు, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఖమర్, నగర మరియు మండల పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణు, లక్ష్మా రెడ్డి, బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, భాషబోయిన వీరన్న, పెంట్యాల పుల్లయ్య, రెడ్డెం వీరమోహన్ రెడ్డి, కనగాల వెంకట రావు, తెలంగాణ ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, గుండ్లపల్లి శేషగిరి రావు, లింగనబోయిన సతీష్, ఆసిఫ్, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా, ఖమ్మం నియోజవర్గాల కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రియల్‌మీ ప్రీమియం ఫోన్ రియల్ మీ జీటీ7 ప్రో..!




ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన ప్రీమియం ఫోన్ రియల్‌మీ జీటీ7 ప్రో ను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ 12 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.59,999, 16 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.65,999 పలుకుతుంది. ఈ నెల 29 మధ్యాహ్నం 12 గంటల నుంచి రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ విక్రయాలు ప్రారంభం అవుతాయి. రియల్‌మీ వెబ్‌సైట్, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్‌ల్లో ఫోన్లు లభిస్తాయి. మార్స్ ఆరెంజ్, గెలాక్సీ గ్రే రంగుల్లో లభిస్తుందీ ఫోన్. రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.78 అంగుళాల ఎల్టీపీఓ అమోలెడ్ ఫుల్ హెచ్డీ+ రిజొల్యూషన్ డిస్ ప్లే కలిగి ఉంటుంది.

క్వాడ్ కర్వ్డ్ స్క్రీన్ విత్ సపోర్ట్స్ డోల్బీ విజన్ అండ్ హెచ్డీఆర్ 10+ కంటెంట్ తో వస్తుంది. ఏజీ గ్లాస్ రేర్ ప్యానెల్ విత్ అల్యూమినియం ఉంటుంది. క్వాల్ కామ్ 8 స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ ఎస్వోసీతో వస్తున్న తొలి స్మార్ట్ ఫోన్ ఇది. సోనీ ఐఎంఎక్స్906 50-మెగా పిక్సెల్ ప్రైమరీ కెమెరా, సోనీ ఐఎంఎక్స్ 882 50-మెగా పిక్సెల్ టెలిఫోటో కెమెరా, సోనీ ఐఎంఎక్స్ 355 8-మెగా పిక్సెల్ ఆల్ట్రావైడ్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ కెమెరా ఉంటుంది. ఆండ్రాయిడ్ 15 బేస్డ్ రియల్‌మీ యూఐ 6.0 వర్షన్ పై పని చేస్తుంది. మూడేండ్ల పాటు సాఫ్ట్ వేర్ అప్ డేట్స్, నాలుగేండ్ల పాటు సెక్యూరిటీ అప్ డేట్స్ అందిస్తుంది. రియల్‌మీ జీటీ7 ప్రో ఫోన్ చైనా మోడల్ ఫోన్ 6500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తే, ఇండియా మోడల్ 5,800 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. ఈ బ్యాటరీకి 120 వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతు ఉంటుంది. రియల్‌మీ జీటీ7 ప్రో (Realme GT 7 Pro) ఫోన్ కేవలం 30 నిమిషాల్లో చార్జింగ్ అవుతుంది.

## పాన్ కార్డు 2.0 ప్రాజెక్టుతో జరిగే మార్పులు ఏంటి..?




**మహా, బిజినెస్:** ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డులు చాలా కీలకం. రూ. 50 వేలు అంతకు మించిన ట్రాన్సాక్షన్స్ చేయాలంటే కచ్చితంగా పాన్ కార్డు ఉండాల్సిందే. ఇప్పటికే పాన్, ఆధార్ కార్డును లింక్ చేస్తూ కేంద్రం పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టింది. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న పాన్ కార్డు లన్నింటినీ రద్దుచేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. అందుకు సంబంధించి సోమవారం కేంద్ర క్యాబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. పాన్ కార్డు విషయంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పాన్ 2.0 పేరుతో తీసుకున్న నిర్ణయానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దాంతె పాత పాన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త కార్డులు అందుబాటులోకి రానున్నాయి. వినియోగదారులు ఈ కొత్త కార్డులను ఉచితంగా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అయితే ఈ మార్పు కోసం ప్రజలపై ఎలాంటి భారం పడకుండా కేంద్రం నిర్ణయం తీసుకుంది. అందుకు రూ.1435 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. పాన్ 2.0 ప్రాజెక్ట్‌లో భాగంగా ట్యాక్స్ చెల్లించే వారికి మెరుగైన డిజిటల్ అనుభవాన్ని అందించనున్నారు. ఈ కార్డులో పాన్ సేవలతోపాటు పన్ను చెల్లింపుదారుల రిజిస్ట్రేషన్ సేవలను కూడా ఏకీకృతం చేయనున్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశంలో 78 కోట్ల పాన్ కార్డులను పంపిణీ చేశామని, ఈ కొత్త ప్రాజెక్ట్ పన్ను చెల్లింపుదారులు ఉపయోగించే ప్రస్తుత వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయనుందని తెలిపారు.

## వ్యాపార దిగ్గజం శశి రుయా కన్నుమూత



**మహా, బిజినెస్:** ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎస్సార్ గ్రూప్ సహ వ్యవస్థాపకుడు శశి రుయా కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 81 ఏళ్లు. వృద్ధాప్య కారణాలతో మంగళవారం ఉదయం మృతి చెందారు. దిగ్గజ వ్యాపారవేత్త మరణం పట్ల ఎస్సార్ గ్రూప్ సంతాపం ప్రకటించింది. 'శశికాంత్ రుయా మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము. సమాజ అభ్యున్నతి, దాతృత్వం పట్ల తిరుగులేని నిబద్ధతతో ఆయన సేవలు అందించారు. ఆయన జీవిత కాలంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించి వారి జీవితాల్లో మార్పునకు కారణమయ్యారు' అని ఓ ప్రకటనలో తెలిపింది. రుయా మరణవార్త తెలుసుకున్న పలువురు వ్యాపారవేత్తలు, దిగ్గజాలు ఆయనకు సంతాపం తెలుపుతున్నారు. శశి రుయా.. 1943లో జన్మించారు. 1969లో తన సోదరుడు రవి రుయాతో కలిసి ఎస్సార్ గ్రూప్‌ను స్థాపించారు. అతి తక్కువ సమయంలోనే తమ సేవలను అనేక రంగాల్లోకి విస్తరించారు. ఇక ఈ గ్రూప్ చేపట్టిన మొదటి ప్రాజెక్ట్ మద్రాస్ పోర్ట్ ట్రస్ట్ ఔటర్ బ్రేక్ వాటర్ నిర్మాణం. వీరి ప్రాజెక్టుల్లో ఇది ప్రధానమైంది. అప్పట్లో ఈ ప్రాజెక్ట్ విలువ రూ.2.5 కోట్లు. ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేయడంతో ఎస్సార్ గ్రూప్‌నకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆతర్వాత డబుల్ బ్రిడ్జీలు, భారీ వంతెనలు, పవర్ ప్లాంట్‌లతో సహా అనేక ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఈ సంస్థ నిర్మించింది. 1980వ దశకంలో ఎస్సార్ అనేక చమురు, గ్యాస్ ఆస్తులను కొనుగోలు చేయడంతో ఇంధన రంగంలోకి విస్తరించింది. 1990 ల్లో స్టీల్, టెలికమ్యూనికేషన్స్ విభాగంలోకి అడుగుపెట్టింది.

## లాభాల్లో మొదలై.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



భారతీ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు ఉదయం లాభాల్లో మొదలయ్యాయి. మధ్యాహ్నం వరకు పెరుగుతూ వచ్చిన సూచీలు ఒక్కసారిగా పతమయ్యాయి. చివరి సెషన్‌లో మళ్లీ కోలుకొని స్వల్ప నష్టాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,415.47 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,482.36 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 79,798.67 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 105.79 పాయింట్లు పతనమై.. 80,004.06 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 24,194.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,179 షేర్లు పురోగమించాయి. మరో 1,580 షేర్లు పతనం కాగా.. 105 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో బ్రిటానియా ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫోసిస్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది. రంగాలవారీగా ఆటో, పవర్, ఫార్మా, ఆయిల్, గ్యాస్ ఒకశాతం నుంచి 1.15శాతం వరకు దిగజారాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ, మెటల్ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు వృద్ధిని నమోదు చేశాయి.

# దేశం-విదేశం NATIONAL NEWS



## బంగ్లాదేశ్‌లో చిన్మయ్ దాస్ అరెస్ట్..

### ఆందోళన వ్యక్తం చేసిన భారత్..

హిందూ సంస్థ సమ్మిళిత్ సనాతనీ జోట్ నేత చిన్మయ్ కృష్ణ దాస్ బెయిల్ పిటిషన్‌ను బంగ్లాదేశ్ కోర్టు తిరస్కరించింది. అతన్ని జైలుకు పంపాలని కోర్టు ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన అకృత్యాలను నిరసిస్తూ గతంలో ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ ప్రభుపై చర్యలు తీసుకున్నారు. దేశద్రోహం, మత సామరస్యానికి భంగం కలిగించారన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ పోలీసులు ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ఆ తర్వాత పలు హిందూ సంఘాలు ఢాకా వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఈ అంశంపై భారత్ స్పందించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చిన్మయ్ దాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

హిందువులతో పాటు మైనారిటీలందరికీ శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛతో సహా భద్రత కల్పించాలని అధికారులకు సూచించింది. అక్టోబర్ 30న బంగ్లాదేశ్‌లో జాతీయ జెండాను అవమానించారన్న కారణంతో చిన్మయ్ దాస్ ప్రభుతో సహా 19 మందిపై దేశద్రోహ చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ సైతం చేశారు. సనాతన్ జాగరణ్ మంచ్ ఎనిమిది అంశాల డిమాండ్లతో చిట్టగాంగ్‌లోని లాల్దిఘి మైదానంలో ర్యాలీ నిర్వహించింది. చౌరస్తాలో ఉన్న ఆజాదీ స్తంభంపై కొందరు వ్యక్తులు కాషాయ జెండాలను ఎగుర వేశారు. జాతీయ జెండాను అవమానించారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

గత ఆగస్టులో ప్రధాని షేక్ హసీనా విద్యార్థి ఆందోళనలతో రాజీనామా చేయాల్సి వచ్చింది. హసీనా సర్కారు పతనం అనంతరం.. మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక సర్కారు కొలువుదీరింది. ఆ తర్వాత హిందువులు, ఇతర మైనారిటీ ప్రజలపై దాడులు జరిగాయి. దీనికి వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి. అక్టోబర్ నుంచి సనాతన్ జాగరణ్ మంచ్ చిట్టగాంగ్‌లో మైనారిటీల రక్షణ, హక్కులను డిమాండ్ చేస్తూ నిరసనలు తెలుపుతున్నది. ఇందులో చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుత్వ పాల్గొని.. తాత్కాలిక ప్రభుత్వంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. మైనారిటీల తరఫున తాత్కాలిక ప్రభుత్వం ఎదుట ఎనిమిది డిమాండ్లను పెట్టారు. మైనారిటీలపై దాడులకు తెగబడే వారిని విచారించేందుకు తాత్కాలిక ట్రైబ్యునల్ ఏర్పాటు, బాధితులకు పరిహారం, పునరావాసం, మైనారిటీ రక్షణ చట్టం అమలు, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏర్పాటు డిమాండ్ చేస్తూ నిరసనలు చేపడుతున్నారు.

## పట్టాలు తప్పిన 20 బోగీలు.. రైళ్ల రాకపోకలపై ప్రభావం




ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ రైల్వే డివిజన్‌లో బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. మంగళవారం ఉదయం 11:11 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బొగ్గు లోడ్‌తో కూడిన గూడ్స్ రైలు బిలాస్‌పూర్ నుంచి కట్నీకి వెళ్తోంది. ఈ క్రమంలో ఖోంగ్‌సార్ మధ్య రైలు పట్టాలు తప్పింది. ఏకంగా రైలులోని 20 బోగీలు పట్టాలు తప్పాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాక్‌ను క్లియర్ చేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే పనులు మొదలు పెట్టారు. రైలు పట్టాలు తప్పడానికి గల ఖచ్చితమైన కారణాలు విచారణ తర్వాత తెలుస్తాయని అధికారులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. ఈ ఘటనతో ఆ మార్గంలో నడిచే పూరీ యోగ్నాగ్రి రిషికేష్ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్, దుర్గ్ - ఎంసీటీఎమ్ (ఉధంపూర్) ఎక్స్‌ప్రెస్ సహా పలు ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.




## ఈ నెల 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం

మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాలను మూటగట్టుకున్న నేపథ్యంలో ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం కాబోతోంది. ఈ నెల 29న సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని అగ్ర నేతలందరూ ఈ సమావేశంలో పాల్గొంటారు. మహారాష్ట్ర, హర్యానాల్లో గెలిచేందుకు మంచి అవకాశాలున్నా కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవడగానికి కారణాలు ఏమిటి..? లోపాలు ఎక్కడున్నాయ్..? అనే అంశాలు సీడబ్ల్యూ సమావేశంలో చర్చకు రానున్నాయి. అదేవిధంగా దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. కాగా, ఈ మధ్య కాలంలో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయాలను చవిచూసింది. ఆ రెండు రాష్ట్రాల్లోనూ గెలుపు తమదేనన్న ధీమాతో కాంగ్రెస్ పార్టీ ఉంది. కానీ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. హర్యానాలో పూర్తిగా అధికార బీజేపీకి వ్యతిరేక పవనాలు వీచినా.. ఆ పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకోలేకపోయింది. మహారాష్ట్రలో కూడా మహాయుతి కూటమిపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. కానీ ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి దాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో విఫలమైంది.

## వాట్సాప్, జీమెయిల్‌ను వాడకుండా నిషేధించిన ప్రభుత్వం..!




**మహా, బిజినెస్:** సున్నితమైన అధికారిక దస్త్రాలను వాట్సాప్, జీమెయిల్ వంటి థర్డ్ పార్టీ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించకుండా జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా ప్లాట్‌ఫారమ్‌ల నుంచి డేటా లీక్, భద్రతా ఉల్లంఘనలు పెరిగే ప్రమాదం ఉందని ఉత్తర్వుల్లో పేర్కొంది. వాట్సాప్, జీమెయిల్ వంటి యాప్స్ సున్నితమైన, రహస్య డేటాను నిర్వహించేందుకు వీలుగా రూపొందించలేదని స్పష్టం చేసింది. ఆయా వ్యవస్థలు ప్రభుత్వ కమ్యూనికేషన్‌కు అవసరమైన కఠినమైన ప్రమాణాలకు అనుగుణంగా లేవని పేర్కొంది.

అధికారులు, ఉద్యోగులు థర్డ్ పార్టీ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగిస్తున్న తీరు పాలనా యంత్రాంగం దృష్టికి వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొంది. కీలకమైన సమాచారం బయటపడితే భద్రత, సమగ్రతకు తీవ్రమైన ముప్పు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. థర్డ్ పార్టీ టూల్స్‌తో సున్నితమైన, గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని పంపిన సందర్భంలో అనధికారిక యాక్సెస్, డేటా లీక్, భద్రతా ఉల్లంఘనలు తదితర అనేక సమస్యలకు దారి తీయవచ్చని పేర్కొంది. సున్నితమైన సమాచారాన్ని నాలుగు కేటగిరిలుగా విభజించారు. టాప్ సీక్రెట్, సీక్రెట్, కాన్ఫిడెన్షియల్, రిస్టిక్టెడ్‌గా విభజించింది.

టాప్ సీక్రెట్, సీక్రెట్ డాక్యుమెంట్స్ ఇంటర్నెట్ ద్వారా షేర్ చేయరు. కేవలం ఎస్ఏజీ గ్రేడ్ ఎన్‌క్రిప్షన్‌తో క్లోజ్డ్ నెట్‌వర్క్ ద్వారా మాత్రమే సంబంధిత సమాచారాన్ని పంపనున్నారు. ప్రభుత్వ ఈమెయిల్స్, ప్రభుత్వ ఇన్‌స్టంట్ మెస్సేజింగ్ ప్లాట్‌ఫామ్‌ల కాన్ఫిడెన్షియల్, పరిమితమైన సమాచారాన్ని పంపేందుకు ఉపయోగాలని ప్రభుత్వం సూచించింది. ఈఆఫీస్ వ్యవస్థలో సరైన ఫైర్‌వాల్, వైట్‌లిస్ట్ చేయబడిన ఐపీ అడ్రెస్‌లను ఉపయోగించాలని ఆదేశించింది. రహస్య డేటాపై చర్చిస్తున్న సమయంలో అమెజాన్ ఎకో, యాపిల్ హోమ్‌పాడ్, గూగుల్ హోమ్ మొదలైన డిజిటల్ అసిస్టెంట్ డివైజ్‌లకు దూరంగా ఉండాలని చెప్పింది.

# భువీకి జాక్‌పాట్



**మొత్తం 204 స్లాట్స్ కోసం 577 మంది క్రికెటర్లు తమ పేర్లు నమోదుచేసుకోగా రెండు రోజుల్లో 182 మంది ప్లేయర్ల (62 మంది ఓవర్సీస్ ఆటగాళ్లు)ను పది ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయి. వీరిపై ఆయా జట్లు కలిసి ఖర్చు చేసిన మొత్తం రూ. 639.15 కోట్లు.**

**జెడ్డా:** తొలి రోజు మాదిరిగానే రెండో రోజూ ఐపీఎల్ వేలంలో ఫ్రాంచైజీలు కీలక ఆటగాళ్లపై కాసులు కుమ్మరించాయి. భారత వెటరన్ పేసర్, గత సీజన్ దాకా సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన భువనేశ్వర్ కుమార్ రెండో రోజు వేలంలో అత్యధిక ధరను దక్కించుకున్నాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అతడిని రూ. 10.75 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. రెండో రోజు రూ. 10 కోట్ల మార్కును దాటిన ఏకైక క్రికెటర్ భువీనే. అతడితో పాటు టీమ్ఇండియా బౌలర్లు దీపక్ చాహర్ (రూ. 9.25 కోట్లు - ముంబై), ముకేశ్ కుమార్ (రూ. 8 కోట్లు ఢిల్లీ), ఆకాశ్ దీప్ (రూ. 8 కోట్లు లక్నో) భారీ ధర పలికారు.ఎవరూ ఊహించని విధంగా సౌతాఫ్రికా పేస్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 7 కోట్ల ధరతో దక్కించుకోగా ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే కోసం రాజస్థాన్ 6.50 కోట్లు వెచ్చించింది. ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యాను రూ. 5.75 కోట్లతో ఆర్సీబీ సొంతం చేసుకోగా కేకేఆర్ మాజీ స్పిన్ ఆల్‌రౌండర్ నితీశ్ రాణాను రాజస్థాన్ రూ. 4.20 కోట్లకు కొనుగోలు చేసింది. వాషింగ్టన్ సుందర్ రూ. 3.20 కోట్లతో గుజరాత్ తీసుకుంది. ఆక్షన్ తొలి రోజు అమ్ముడుపోని డేవిడ్ వార్నర్‌ను రెండో రోజూ ఫ్రాంచైజీలు పట్టించుకోకపోగా దేవ్‌దత్ పడిక్కల్ ఎట్టకేలకు తిరిగి ఆర్సీబీ గూటికి (రూ. 2 కోట్లు) చేరాడు.

### భువీ సొంతగూటికి..

2009లో ఆర్సీబీ తరపునే (చాంపియన్స్ లీగ్) ఎంట్రీ ఇచ్చిన భువీని తిరిగి సొంతగూటికి చేర్చుకునేందుకు బెంగళూరు చాకచక్యంగా వ్యవహరించింది. రూ. 30.65 కోట్ల భారీ పర్స్‌తో రెండో రోజు వేలంలోకి వచ్చిన ఆర్సీబీ.. ఆరంభంలో భువీని పట్టించుకోలేదు. సన్‌రైజర్స్ వద్దనుకున్న భువీ కోసం ముంబై, లక్నో పోటీ పడ్డాయి. కానీ అనూహ్యంగా రేసులోకి వచ్చిన బెంగళూరు.. భారీ ధరకు అతడిని దక్కించుకుంది.

### ప్రియాన్ష్ కోసం పోటాపోటీ

కొద్దిరోజుల క్రితం ముగిసిన ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మెరుపులు మెరిపించిన యువ సంచలనం ప్రియాన్ష్ ఆర్య కోసం ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. అలవోకగా సిక్సర్లు బాదే ఈ కుర్రాడి కోసం ఆర్సీబీ, ఢిల్లీ, పంజాబ్ పోటాపోటీగా బిడ్ వేశాయి. కానీ చివరికి పంజాబ్.. రూ. 3.6 కోట్ల ధరతో అతడిని దక్కించుకుంది.

### 13 ఏండ్ల కుర్రాడి కోసం..

ఎవరూ ఊహించని విధంగా బీహార్‌కు చెందిన 13 ఏండ్ల వైభవ్ సూర్యవంశీ.. వేలంలో రూ. 1.10 కోట్లు దక్కించుకున్నాడు. 13 ఏండ్ల 243 రోజుల వయసున్న వైభవ్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పోటీ పడ్డాయి. రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతడిని చివరికి రాజస్థాన్ సొంతం చేసుకుంది. కొద్దిరోజుల క్రితమే చెన్నై వేదికగా ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన యూత్ టెస్టులో వైభవ్.. 62 బంతుల్లోనే శతకం బాది అంతర్జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు.



# అత్యవసరంగా స్వదేశానికి బయలుదేరిన కోచ్ గౌతం గంభీర్

**పెర్త్:** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్.. ఆస్ట్రేలియా పర్యటన నుంచి ఆకస్మికంగా స్వదేశానికి బయలుదేరారు. కుటుంబసభ్యులతో కలిసి ఇవాళ ఆయన ఇండియాకు రిటర్న్ అయ్యారు. అత్యవసరమైన వ్యక్తిగత కారణాలతో గంభీర్.. స్వదేశానికి బయలుదేరినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6వ తేదీన అడిలైడ్‌లో జరగనున్న రెండవ టెస్టుకు ముందు.. మళ్లీ గంభీర్ జట్టుతో కలవనున్నట్లు బీసీసీఐ వర్గాల ద్వారా వెల్లడైంది. నవంబర్ 30 నుంచి కేన్‌బెరాలో జరగనున్న వార్మప్ మ్యాచ్‌కు దూరం కానున్నారు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో బుమ్రా నేతృత్వంలోని ఇండియన్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే బుధవారం ఆ జట్టు పెర్త్ నుంచి కేన్‌బెరా బయలుదేరుతుంది. అక్కడ ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఇచ్చే ప్రత్యేక విందులో భారత జట్టు క్రికెటర్లు పాల్గొంటారు. ఇక రెండవ టెస్టు మ్యాచ్ డే అండ్ నైట్ గేమ్ కావడంతో.. భారత జట్టు ఆ మ్యాచ్ కన్నా ముందే ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడనున్నది. రెండో టెస్టు కోసం పింక్ కలర్ కోకాబురా బంతిని వాడనున్నారు. ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టుతో జరిగే మ్యాచ్‌కు భారత్ సిద్ధమైంది. ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టుకు జాక్ ఎడ్వర్డ్స్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆ జట్టు పూర్తిగా యువకులతో నిండి ఉన్నది. స్కాట్ బోలాండ్, మాథ్యూ రెన్‌షా కూడా ఆ జట్టులో ఉన్నారు. అనధికార మ్యాచ్ కావడం వల్ల.. రెండు జట్లూ బ్యాటింగ్, బౌలింగ్ చేసే రీతిలో ప్రాక్టీస్ గేమ్ కొనసాగనున్నది.

# డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో..

### మళ్లీ అగ్రస్థానానికి టీమ్ ఇండియా



**దుబాయ్:** పెర్త్ టెస్టులో ఘనవిజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. స్వదేశంలో కివీస్‌తో సిరీస్‌ను 03తో కోల్పోయిన భారత్.. డబ్ల్యూటీసీ టేబుల్‌లో రెండో స్థానానికి పడిపోయిన విషయం తెలిసిందే. అయితే తాజా విజయంతో భారత్.. 61.11 శాతంతో తిరిగి అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా (57.69 శాతం), శ్రీలంక (55.56 శాతం) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ సైకిల్‌లో భారత్ 15 టెస్టులాడి 9 విజయాలు ఐదింట్లో ఓడి ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

# 7 రన్స్‌కే ఆలౌట్.. టీ20 క్రికెట్‌లో ఐవరీ కోస్ట్ అత్యంత చెత్త రికార్డు



**లాగోస్ (నైజీరియా):** అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఆఫ్రికా దేశం ఐవరీ కోస్ట్.. ఏడు పరుగులకే ఆలౌట్ అయి అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ సబ్ రీజియన్ ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో భాగంగా నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 7 రన్స్‌కే కుప్పకూలింది. మొదట బ్యాటింగ్ చేసిన నైజీరియా నిర్ణీత ఓవర్లలో 271/4 పరుగుల భారీ స్కోరు చేసింది.



## సినిమా వార్తలు MOVIE NEWS






# ఇక్కడ ప్రతిదీ కొంచెం కష్టమే..

### ఇండస్ట్రీలో నెపోటిజమ్‌పై కృతిసనన్

ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి తనకంటూ ప్రత్యేకంగా ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కృతిసనన్ (Kriti Sanon). తెలుగులో మహేశ్ బాబుతో వన్ నేనొక్కడినే, నాగచైతన్యతో దోచెయ్ సినిమాల్లో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీపైనే ఫోకస్ పెట్టిందని తెలిసిందే. ఈ బ్యూటీ IFFI 2024 ఈవెంట్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో ఇండస్ట్రీలో నెపోటిజమ్ (బంధు ప్రీతి)తోపాటు తన డ్రీమ్ రోల్ ఏంటో చెప్పుకొచ్చింది.

డ్రీమ్ రోల్ గురించి మాట్లాడుతూ.. నాకు సూపర్ ఉమెన్ పాత్ర చేయాలని ఉంది. పూర్తిగా నెగెటివ్ పాత్రలో నన్ను నేను ఆవిష్కరించుకోవాలనుకుంటున్నానని చెప్పింది. నెపోటిజమ్‌కు ఇండస్ట్రీ పెద్దగా బాధ్యత వహించదని నేను భావిస్తున్నా. కానీ ఈ విషయంలో మీడియా, ప్రేక్షకులు చాలా కీలక పాత్ర పోషిస్తారు. కొందరు స్టార్ కిడ్స్ పట్ల మాత్రం మీడియా ఎలా వ్యవహరిస్తుందో ప్రేక్షకులు చూడాలనుకుంటారు. ప్రేక్షకులు ఆ స్టార్ కిడ్స్ పట్ల ఆసక్తి చూపించడం వల్ల వారితో సినిమా చేయాలని ఇండస్ట్రీ భావిస్తుంది. ఇది ఒక సర్కిల్ అని నేననుకుంటున్నానంది.

మీరు ప్రతిభావంతులైతే ఇండస్ట్రీకి చేరుకుంటారు. ప్రతిభావంతులు కాకపోతే, ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వలేకపోతే, అక్కడికి చేరుకోలేరు. నేను వచ్చినప్పటి నుంచి ఇండస్ట్రీ నాకు సాదర స్వాగతం పలికింది. మీరు సినిమా బ్యాక్ గ్రౌండ్ నుంచి రానప్పుడు.. మీరు కోరుకున్నది అందుకునేందుకు సమయం పడుతుంది. మ్యాగజైన్ కవర్‌లో చోటు సంపాదించుకోవడానికి కూడా టైం పడుతుంది. కాబట్టి ప్రతిదీ కొంచెం కష్టంతోనే కూడుకుని ఉంటుందని చెప్పుకొచ్చింది.



# భయపెట్టేందుకు వస్తోన్న వేదిక.. థియేటర్లలోకి ఫియర్ వచ్చేది అప్పుడే

బాణం, రూలర్, శివలింగ, కాంచన 3 సినిమాలతో టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది వేదిక (Vedhika). ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా.. వీటిలో ఒకటి ఫియర్ (Fear). ఈ సినిమాకు లక్కీ లక్ష్మణ్ నిర్మాత హరిత గోగినేని కథనందిస్తూ దర్శకత్వం వహిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. చీకట్లో ముఖంపై చేతులు పెట్టుకొని భయంగా కనిపిస్తున్న లుక్ ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచుతోంది. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. భయంకరమైన FEAR ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ధైర్యంగా మిమ్మల్ని మీరుసిద్ధం చేసుకోండి. వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మిస్తుండగా.. సుజాత రెడ్డి సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆండ్రీవ్ బాబు సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు.



### రాంగోపాల్ వర్మ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

# విచారణ వాయిదా

**అమరావతి :** ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈనెల 27కు ఏపీ హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో రాంగోపాల్ వర్మపై ఒంగోలు, విశాఖ, గుంటూరు జిల్లాలో కేసులు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసులో పోలీసులు రెండు సార్లు నోటీసులు అందించినా వర్మ విచారణకు హాజరుకాలేదు. దీంతో వర్మ కోసం పోలీసులు హైదరాబాద్, తమిళనాడులో గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టులో ఆర్జీవీ ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు.



# బాలకృష్ణతో వన్స్‌మోర్..

### అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో శ్రీలీల

టాలీవుడ్ యాక్టర్ బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే. బాలకృష్ణ సీజన్ 4లో ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ కొత్త కొత్త సెలబ్రిటీలతో సందడి చేస్తున్నాడు. ఇటీవలే పుష్ప 2 ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో బాలకృష్ణతో సందడి చేశాడని తెలిసిందే. ఈ ఎపిసోడ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. భగవంత్ కేసరిలో బాలకృష్ణతో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా బాలయ్య, శ్రీలీల మరోసారి సందడి చేయబోతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా మరో అతిథిగా డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల (Sreeleela)ను ఫైనల్ చేశారు మేకర్స్. శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూట్‌లో జాయిన్ అయింది. స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు హొయలు పోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రీలీల ఎపిసోడ్ ప్రోమో ఎప్పుడొస్తుందనేది తెలియాల్సి ఉంది. అన్‌స్టాపబుల్ షోలో శ్రీలీల తర్వాత రాబోయే గెస్ట్ నవీన్ పొలిశెట్టి అని ఫిలింనగర్ సర్కిల్ టాక్.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

### కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో

# ఘనంగా 75 రాజ్యాంగ దినోత్సవం

## అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన కాంగ్రెస్ నేతలు





**ఆదిలాబాద్ మహా :** భారతదేశంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు వస్తున్నాయంటే అది మనకు రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు అని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు.75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాజ్యాంగ నిర్మాత భారత రత్న బాబాసాహెబ్ డాక్టర్ అండేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి రాజ్యంగ రచనలో ఆయన సేవలను కొనియాడారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలో పలు దేశాలకు కూడా మన భారత రాజ్యాంగం ఆదర్శమన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశంలో రాజ్యంగానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సమానత్వంలో,అవకాశాలలో ,ప్రశ్నించే తత్వంలో, రాజకీయ రంగంలో ఇలా ప్రతీ ఒక్కరికి హక్కు ఉందన్నారు. ఇలా అనేక హక్కులన్నీ కూడా రాజ్యాంగం కల్పించినవే నని తెలిపారు. ప్రతీ ఒక్కరు రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొందరు రాజ్యాంగానికి వ్యతిరేకంగా రాజ్యాంగ విలువలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారని అలాంటి వారు పుట్ట గతుల్లేకుండా పోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్,కౌన్సిలర్లు బండారి సతీష్,యెల్మెల్వార్ రామ్ కుమార్,సంద నర్సింగ్,ఎస్.సి వింగ్ ఆదిలాబాద్ అసెంబ్లీ సెక్రటరీ వసంత్ పవర్,పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దాసరి ఆశన్న,నాయకులు యెల్టీ భోజా రెడ్డి,బోనగిరి సంటన్న,పోరెడ్డి కిషన్,కొండూరి రవి,భరత్ శ్రవణ్ నాయక్,దొగ్గలి రాజేశ్వర్,కుర్ర మహేష్,షేక్ మన్సూర్,అనుముల ఉదయ్ కిరణ్,అంజద్ ఖాన్,అయాస్,రమేష్,నడికుంటి ప్రభాకర్, సమీర్ అహ్మద్, అశోక్, గంద్రత్ వెంకటేష్,అల్లాబకష్,నరిగి ఆశన్న యాదవ్ మహిళా నాయకురాలు నల్వాల సుమ,మంథకిని,అఫ్రోజా తదితరులు పాల్గొన్నారు.



### వ్యాధి నిరోధక టీకాల పై

# వర్క్ షాప్

## జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో కార్యక్రమం

**నిర్మల్ మహా :** జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ వర్క్ షాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వర్క్ షాప్ లో నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు. ఇందులో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నయనా రెడ్డి, జోనల్ సర్వలెన్స్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ అతుల్, డాక్టర్ మురారి, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ జోష్ణ, డాక్టర్ డేవిడ్, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్ పాల్గొన్నారు.

### దుబ్బగూడ లో నూతన గ్రామ పంచాయతీ

# భవన నిర్మాణానికి 20 లక్షల నిధులు

## మంజూరు చేయించినందుకు కంది శ్రీనివాస రెడ్డి ప్లెక్సీకి గ్రామస్తుల పాలభిషేకం




**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడ గ్రామానికి నూతన గ్రామ పంచాయతి భవన నిర్మాణ పనుల నిమిత్తం 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతగా గ్రామస్తులు ఆయన ఫ్లెక్సీకి పాలాభి షేకం చేసారు.కంది శ్రీనివాస రెడ్డి కృషితో పాటు జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు అయినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. నియోజక వర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పట్టుదలగా శ్రమిస్తున్నట్టు చెప్పారు. త్వరలో గ్రామానికి 25 ఇందిరమ్మ ఇండ్లు కూడా ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు బోనగిరి సంటన్న,గ్రామ పటేల్ ఆత్రం జంగు,నాయకులు టెకం మోకాశి, కుమ్ర తుకారాం, ఆత్రం సోనేరావు, కొడప మేఘ్ రాజ్, కొడప బాపూరావు, టెకం లక్ష్మణ్, మడవి రాము తదితరులు పాల్గొన్నారు.

# హసీంపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

## 20 లక్షల నిధులు మంజూరు చేయించినందుకు కంది శ్రీనివాస రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు





**ఆదిలాబాద్ మహా :** జైనథ్ మండలం హసీంపూర్ గ్రామంలో 20 లక్షల నిధులతో చేపట్టనున్ననూతన గ్రామ పంచాయతి భవన నిర్మాణ పనులకు జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి భూమి పూజ చేసారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి కృషితో పాటు జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు అయినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. నియోజక వర్గ అభివృద్ధి కోసం ముందడుగు వేస్తున్న అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కృషితో త్వరలో ఉపాధి హామీ పథకం ద్వారా మరో 5 లక్షల నిధులతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అంతేకాకుండా ఇంటి స్థలమున్న పేదలకు ఇల్లు కట్టుకోవడానికి త్వరలో 5లక్షల ఆర్థిక సాయం కూడా ప్రభుత్వం అందచేస్తుందన్నారు. స్థానిక కాంగ్రెస్ నేతలు అలాంటి వార్ల పేర్లు సేకరించి కంది శ్రీనివాస రెడ్డికి పంపాలని కోరారు.నిధులు మంజూరు చేయించినందుకు కంది శ్రీనివాస రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో జైనథ్ లక్ష్మి నారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ రాజన్న,నాయకులు గడ్డం జగదీష్ రెడ్డి,ఎల్మ గంగా రెడ్డి,కుంట కిష్ట రెడ్డి,బోనగిరి సంటన్న,తరోడ లాస్మా రెడ్డి, గ్రామ నాయకులు రఘురామ్ తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



### రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా

# మాక్ పోల్

**నిర్మల్ మహా :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ ఎలా ఉంటుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భైంసా మండలం దేగాం ఉన్నత పాఠశాలలో సాధారణ ఎన్నికల మాదిరిగా నమూనా ఎన్నికలు మాక్ పోల్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రజాస్వామ్యంలో ఎన్నికల విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుంటారని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు అజీమ్ అన్నారు. ఎన్నికలలో ఓటు హక్కును ఎలా సద్వినియోగం చేసుకోవాలన్నదానితో పాటు ఓటు విలువ గురించి తెలుసుకుంటారని అన్నారు. ఈ మాక్ పోల్ లో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నిర్భయంగా వారి ఓటును వినియోగించుకున్నారు. ఎన్నికల తరువాత ఓట్లను లెక్కపెట్టి గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఆ తరువాత సమావేశము నిర్వహించి విద్యార్థులచే రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యత గురించి ఉపన్యాసాలు, పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమములో విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

# షార్ట్ సర్క్యూట్‌తో ల్యాండ్రీ షాప్‌లో అగ్ని ప్రమాదం

## 350 జతలకు పైగా దుస్తులు దగ్ధం



**నిర్మల్ మహా :** రెవెన్యూ డివిజన్ కేంద్రమైన బైంసాలోని పాత సినిమా టాకీస్ సమీపంలో గల సాయిరాణి డ్రై క్లినింగ్ అండ్ ల్యాండ్రీ షాపులో సోమవారం అర్ధరాత్రి వేళలో అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ తో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా సమాచారం. ఘటనలో ల్యాండ్రీ షాపులో డ్రై క్లినింగ్, ఐరన్ ( ఇస్త్రీ ) చేయించేందుకు 150 మందికి పైగా కస్టమర్లు అందించిన 350 పైగా దుస్తుల జతలు దగ్ధమయ్యాయి. వీటితో పాటు ల్యాండ్రీ షాపులోని ఫర్నిచర్ తో సహ ఇతర సామాగ్రి దగ్ధమయ్యి ఎందుకు పనికి రాకుండా పోయాయి. సంబంధిత అగ్నిప్రమాద సమాచారం అందుకున్న ల్యాండ్రీ షాపు యజమాని సంటోళ్ల అనిల్ ఘటన స్థలికి చేరుకొని అందుబాటులో ఉన్న వనరుల ద్వారా మంటలను అర్పివేసేందుకు చర్యలు చేపట్టాడు. ఇదే సమయములో ప్రమాద సమాచారాన్ని అగ్నిమాపక శాఖకు అందించగా ఫైర్ ఇంజన్ తో వచ్చిన సిబ్బంది మంటలను అర్పివేసారు. అప్పటికే ల్యాండ్రీ షాపులోనున్న దుస్తులతో పాటు ఫర్నిచర్, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి.

### ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో

# 75వ రాజ్యాంగ దినోత్సవం



**నిర్మల్ మహా:** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. నిర్మల్ టాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం డిసెంబర్ ఒకటిన జరగబోయే మాలల సింహ గర్జన సభ కు నిర్మల్ జిల్లా లోని మాలలు అందరూ కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్, కుంటోళ్ల వెంకట స్వామి, మాల మహానాడు కొంత గణేష్, డీ, సంతోష్, పురుషోతమ్, సంతోష్, ఆకుల రమేష్, రాజు, రజినేష్, రాజు, సతీష్, తదితర నాయకులు పాల్గొన్నారు

# మహారాష్ట్ర దేశిదారు పట్టివేత

## పక్కా సమాచారం మేరకు దాడిచేసిన పోలీసులు

**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది మంగళవారం రైడ్ నిర్వహించి మూడు బాక్సుల మహారాష్ట్ర దేశీదారు మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై నిర్మల పాటిల్ మాట్లాడుతూ పట్టణంలోని కిసాన్ గల్లీలో గల ప్రభుత్వ బాలికల పాఠశాల వెనకాల గల పొదల్లో మహారాష్ట్ర దేశీదారు బాటిల్స్ ఉంచి గుట్టుగా వ్యాపారం కొనసాగిస్తురన్నారన్న పక్కా సమాచారం మేరకు తమ ఎక్సైజ్ శాఖ సిబ్బందితో రైడ్ నిర్వహించినట్టు తెలిపారు. నిందితుల కోసం ఆరా తీస్తున్నామన్నారు. ఈ రైడ్ లో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



# నిర్మల్ కలెక్టరేట్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**నిర్మల్ మహా :** ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగం అనేది ఆత్మ వంటిదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులకు, ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు అనేవి ప్రజల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయని ఆమె అన్నారు. రాజ్యాంగ నిర్మాతల కృషిని కొనియాడారు. ఆనాటి మేధావుల కృషి వల్ల మనకు పటిష్టమైన రాజ్యాంగం లభించిందన్నారు. అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, ప్రజలు రాజ్యాంగ విలువలు పాటిస్తూ దేశ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆలయ హుండీ లెక్కింపు

## 89 రోజుల్లో కోటి 30 వేల 657 నగదు ఆదాయం

**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా బాసరలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం అధికారులు చేపట్టారు. దేవస్థాన కార్య నిర్వహణాధికారి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమీషనర్, వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్, నిర్మల్ జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. 89 రోజుల వ్యవధిలో ఒక కోటి ముప్పైవేల ఆరువందల యాభై ఏడు రూపాయల నగదు, 143 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 250 గ్రాముల మిశ్రమ వెండి, కొంత విదేశీ కరెన్సీ సమకూరినట్లు ఆలయ పాలకవర్గం తెలిపింది. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్, దేవస్థాన వైదిక పరిపాలనా సిబ్బంది, ఎస్పీఐ సిబ్బంది,బాసర పోలీసు సిబ్బంది, దేవస్థాన హోం గార్డ్స్, వాగ్దేవి సొసైటి సభ్యులు, శ్రీశైల భ్రమరాంబికా సేవాసమితి కామారెడ్డి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### జన్నారం మండలంలో పలు అభివృద్ధి పనులకు

# ఎమ్మెల్యే భూమి పూజలు

**ఆదిలాబాద్ మహా:** ప్రజా ప్రభుత్వం ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పొనకల్ లో సిసి రోడ్డునిర్మాణ పనులు, లోతొర్రె గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణం, మురిమడుగు గ్రామంలో పౌల్ట్రీ షెడ్ కు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని తమ పర భేదాలు లేకుండా ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు.



మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం అనేక పథకాలను తీసుకువస్తున్నామని మహిళాభ్యున్నతికి కృషిచేస్తామని అన్నారు.

# పురుగులమందుతాగి ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

## సర్వీసు బుక్‌లో అధికారి సంతకం పెట్టడంలేదని అఘాయిత్యం

### అప్రమత్తమైన సిబ్బంది, చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలింపు

**ఆదిలాబాద్ మహా :** సర్వీసు బుక్‌లో ఓ అధికారి సంతకం పెట్టడంలేదని విసుగుచెందిన ఉద్యోగి ఏకంగా ఆర్డీఓ కార్యాలయంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని ఆర్డీఓ సెక్షన్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ అధికారి తన సర్వీసు బుక్‌లో సంతకం పెట్టడంలేదని నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన అభిషేక్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇతను వీఆర్ ఏగా పనిచేసి ఇతరశాఖలో సర్దుబాటు అయ్యాడు. అయితే సదరు సెక్షన్ అధికారి సంతకం పెట్టకుండా ఇబ్బంది పెట్టడంతో ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న పురుగులమందుతాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి నోటిలో నుండి నురగలు రావడంతో అప్రమత్తమైన




కార్యాలయ సిబ్బంది వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో కారులోనే రిమ్స్ కు తరలించారు.

# దేగాంలో వైభవోపేతంగా అయ్యప్ప పడి పూజ

## వేలాది సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

**నిర్మల్ మహా :** వేలాది మంది స్వాములతో అయ్యప్ప పడిపూజ మహోత్సవం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో మంగళవారం వైభవోపేతంగా జరిగింది. 18 సంవత్సరాల మాలాధారణ సందర్భంగా నారికేళ మహా పడిపూజను నిర్వహించారు. ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప పల్లకి సేవా, స్వాముల నృత్యాలు, భజనలతో దేగాం గ్రామం అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. నియోజకవర్గం నుండి పెద్ద మొత్తంలో అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు. మాలధారణ ప్రాముఖ్యతను గురు స్వాములు వివరించారు. పడి



పూజలో చేపట్టిన అభిషేక ఘట్టం కమనీయంగా కొనసాగింది.

# గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పిప్పలదరి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని,ఎక్కడ ఏ సమస్య ఉన్న తన ద్రుష్టి కి తీసుకు రావాలని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటూ నియోజకవర్గన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా డా. బీఆర్ అంబెడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే 100 రోజుల ఉపాధి హామీ పనులు పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కూలీలను ఎమ్మెల్యే శాలువతో సన్మానించారు ప్రతీ ఒక్కరు ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పరిశీలించిన అదనపు కలెక్టర్



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో క్షేత్ర స్థాయిలో దాదాపుగా పూర్తి కావస్తోంది. దీంతో కంప్యూటర్లలో డాటా ఎంట్రీ చేస్తున్న కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆకస్మికంగా తనిఖీ చేసారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ,పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ విధానాన్ని ఆమె పరిశీలించారు.ఫీల్డ్ లో సేకరించిన వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా సరిగ్గా ఎంట్రీ చేయాలని సూచించారు.